


‘రాజముద్ర’ తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 31.01.2026 | సంపుటి : 2 | సంచిక :355 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Saturday | 31.01.2026 | volume : 2 | Issue : 355 | Pages : 8 | Cost : 2/- |

## విలేకరులు కావలెను

‘రాజముద్ర’ తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



## కెనడీ స్కూల్‌లో రేవంత్ శిక్షణ

### వారం రోజుల సర్టిఫికెట్ కోర్సు పూర్తి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలో ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీలోని కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లోఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. లీడర్ షిప్ అనే కోర్సును పూర్తిచేసి సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని పొందారు. జనవరి 25న ఈ కోర్సు ప్రారంభమవగా జనవరి 30 వరకు అంటే వారం రోజుల పాటు నిర్వహించారు.

హైదరాబాద్, జనవరి 30 : ఈ కోర్సులో సీఎం రేవంత్‌తో పాటు 62 మంది కోహోర్ట్ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. దాదాపు 20కి పైగా దేశాల నుంచి ప్రతినిధులు ఇందులో

-మిగతా 2 లో..



# మేడారం భక్తజన సందోహం

### దారిపొడవునా భక్తుల పొర్లుదండాలు..శివసత్తుల పూనకాలు

మేడారం మహా జాతరలో సమ్మక్క, సారలమ్మలు గద్దెలనెక్కారు. ఈ నేపథ్యంలో ఆ వన దేవతలను దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం పోటెత్తారు. దీంతో భక్తులను కంట్రోలు చేయ డం ఒకానొక దశలో తీవ్రంగా పరిణమించిం ది. ఇప్పటికే పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రు లు ఈ జాతరకు హాజరై.. వన దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

### క్యూలైన్లలో గంటలతరబడి నిరీక్షణ

ములుగు, జనవరి 30 : ఈనె 28న ప్రారంభమైన ఈ జాతర.. 31న ముగియనుంది. ఇంకో వైపు జాతరలో జరుగుతున్న పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి విద్యుత్ సరఫరా

## పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టొద్దు

అజెండాలో 12 అంశాలు చేర్చాలి

జలశక్తి కమిటీ ముందు తెలంగాణ డిమాండ్

ముగిసిన జలశక్తి కమిటీ భేటీ



కేంద్ర జలవివాదాల పరిష్కార కమిటీ సమావేశం ముగిసింది. దాదాపు రెండు గంటలపాటు ఈ భేటీ జరిగింది. అజెండాలో 12 అంశాలు చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టవద్దని కోరింది. ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు 50 శాతం వాడుకునే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. 02

# మరోసారి కేసీఆర్‌కు నోటీసులు

### కేసీఆర్‌కు సిట్ షాక్

ఫామ్‌హౌజ్ విచారణ కుదరదని స్పష్టీకరణ

నందినగర్ ఇంట్లోనే విచారిస్తామని వెల్లడి

ఆదివారం 3గంటలకు విచారణకు సిద్దంగా ఉండాలని నోటీస్

న్యాయనిపుణులతో చర్చించి నోటీసులు ఇచ్చిన సిట్



హైదరాబాద్, జనవరి 30 : ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. సిట్ అధికారులు శు క్రవారం మరోసారి ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే కేసీఆర్‌ను విచారించాలని నిర్ణయించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని తెలిపారు. కాగా, నిన్న( గురువారం) సిట్ అధికారులు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సిట్ అధికారులు వెళ్లి నోటీసులు అందజేశారు. శు క్రవారం మధ్యాహ్నం 3:00

-మిగతా 2 లో..



## వరుసగా తొమ్మిదోసారి..


### ఆర్థికమంత్రిగా నిర్మలమ్మ రికార్డు

అత్యధికసార్లు ప్రవేశ పెట్టిన మహిళా మంత్రిగా ఘనత

న్యూఢిల్లీ, జనవరి 30 : నిర్మలా సీతారామన్ ఆర్థికమంత్రిగా చరిత్ర సృష్టించేందుకు సిద్ధమ య్యారు. ఫిబ్రవరి 1న ఆమె పార్లమెంటులో బడ్జెడెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా ప్రవేశపెట్టనున్న 9వ బడ్జెట్

-మిగతా 2 లో..

# చంద్రబాబుతో దోస్తీతో ఏపీకి లైన్ క్లియర్



తెలంగాణ ప్రాజెక్టులకు పాతర

నల్లమల సాగర్ ప్రాజెక్ట్ కోసం నాటకాలుడుతన్న రేవంత్

ఇరిగేషన్ మీటింగ్ బాయ్‌కాట్ చేయడం ఒక్కటే మేలు

రేవంత్‌ను ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్న హరీష్ రావు

ఏపీ సీఎం చంద్రబాబుతో సీఎం రేవంత్‌రెడ్డి దోస్తీ కట్టి తెలంగాణకు అన్యాయం చేస్తున్నడని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. చంద్రబాబుతో దోస్తీ కోసం రాష్టానికి అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డిని తెలంగాణ సమాజం క్షమించదని అన్నారు. శు క్రవారం తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి హరీష్‌రావు మాట్లాడారు. కేసీఆర్ హయాంలో కేంద్రానికి 10 డీపీఆర్‌లు పంపి ఏడు ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ఒక్క అనుమతి కూడా తేలేదని ఎద్దేవా చేశారు.

హైదరాబాద్, జనవరి 30 : ’ఢిల్లీ మీటింగ్‌కు వెళ్లేందుకు ఆదిత్యనాథ్ మినహా తెలంగాణ సోయి కలిగిన ఒక్క ఇంజినీర్ దొరకలేదా..?’ అని హరీష్‌రావు ప్రశ్నించారు. మన తెలంగాణ నీళ్లను ఏపీకి తీసుకువెళ్లే కుట్ర ఇది. తెలంగాణ సోయి ఉన్న ఒక్క

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74



## గోల్డ్, సిల్వర్ ధరల్లో దిద్దుబాటు

### గోల్డ్, సిల్వర్ ధరల్లో భారీ దిద్దుబాటు

న్యూఢిల్లీ : ఇటీవల కాలంలో దూసుకెళ్లిన బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. గడిచిన కొన్ని నెలల్లో ఎప్పుడూ లేని స్థాయిలో భారీగా దిద్దుబాటుకు లోనయ్యాయి. ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో రెండు లోహాలూ గరిష్ఠ స్థాయిలకు చేరడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడం ఇందుకు కారణం. ఫ్యూచర్ మార్కెట్‌లో వెండి ధర దాదాపు రూ.67 వేలు పతనం కాగా.. బంగారం సైతం రూ.15వేలు తగ్గింది. మల్టీ

-మిగతా 2 లో..

## తెలంగాణలో ముగిసిన మున్సిపల్ నామినేషన్ల ఘట్టం


భారీగా నామినేషన్లు వేసిన అభ్యర్థులు

సాయంత్రం క్యూలో ఉన్న వారికి అనుమతి

గజ్వేల్‌లో భారీ ర్యాలీ నిర్వహించిన ఎంపి రఘునందన్

హైదరాబాద్, జనవరి 30 : తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. ఆఖరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్‌ల దాఖలుకు గడువు మగియగా..

-మిగతా 2 లో..




## దానం అనర్హతపై స్పీకర్ విచారణ

కౌశిక్ రెడ్డి పిటిషన్ ఆధారంగా క్రాస్ ఎగ్జామిన్

సమయం కోరిన బిజెపి నేత మహేశ్వరెడ్డి

18న విచారణకు హాజరు కావాలని గడువు



హైదరాబాద్,జనవరి30 : పార్టీ ఫిరాయింపు కేసులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ

-మిగతా 2 లో..జ

### పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును

# అజెండాలో పెట్టొద్దు

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ అధికారులు లేవనెత్తిన పలు అంశాలపై ఏపీ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. వారంలోగా అజెండా అంశాలు ఖరారు చేసి లిఖితపూర్వకంగా ఇవ్వాలని సీడబ్ల్యూసీ ఛైర్మన్ తెలిపారు. అజెండా అంశాలు ఖరారయ్యాక భేటీ తేదీని ఖరారు చేస్తామని ఛైర్మన్ స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య నదీ జలాల నిర్వహణ, వినియోగం విషయంలో కొనసాగుతున్న వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశం శుక్రవారం ఢిల్లీలో ప్రారంభమైంది. సీడబ్ల్యూసీ ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతోంది. కమిటీ తదుపరి చర్చల కోసం జల వివాదాలకు సంబంధించిన అజెండా అందజేయాలని కమిటీ సభ్యులను సీడబ్ల్యూసీ ఛైర్మన్ కోరారు. ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, జలవనరుల శాఖ సలహాదారులు, ఇంజనీర్ ఇన్- చీఫ్‌లు, జలవనరుల శాఖ అధికారులు, కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ ఛైర్మన్లు, ఎన్‌డబ్ల్యూడీఏ చీఫ్ ఇంజనీర్ హాజరయ్యారు. ఏపీ నుంచి జలవనరుల శాఖ అడ్వైజర్- వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి పలువురు అధికారులు హాజరయ్యారు. అలాగే తెలంగాణ నుంచి ఆదిత్యనాథ్, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్, కేంద్ర రాష్ట్ర సమన్వయ అధికారి గౌరవ్ ఉప్పల్ హాజరయ్యారు.

## హార్వర్డ్ వర్సిటీలో సిఎం రేవంత్ శిక్షణ

(మొదటిపేజీ తరువాయి)

భాగస్వాములయ్యారు. అమెరికాలోని కేంబ్రిడ్జ్‌లో మైనస్ 24 డిగ్రీల తీవ్ర చలిలోనూ రేవంత్ రెడ్డి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులకు హాజరయ్యారు. కేస్ స్టడీలు, గ్రూప్ డిస్కషన్లు, కన్సల్టేటివ్ వర్క్‌లతో కూడిన ఇంటెన్సివ్ ప్రోగ్రామ్‌లో భాగంగా అధికారం, నాయకత్వం, సంఘర్షణలు, అనిశ్చితి వంటి అంశాలపై శిక్షణ పొందారు. ప్రోగ్రామ్ ముగిసిన సందర్భంగా హార్వర్డ్ అధ్యాపకులు రేవంత్ రెడ్డితో పాటు మిగిలిన 62 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అయితే భారతదేశ చరిత్రలో అధికారంలో ఉండగానే హార్వర్డ్ నుంచి ఈ రకమైన సర్టిఫికెట్ పొందిన తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రికార్డ్ సృష్టించారు.

## కేసీఆర్‌కు సిట్ షాక్

(మొదటిపేజీ తరువాయి)



చేశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న కేసీఆర్ అభ్యర్థనను సిట్ తిరస్కరించింది. హైదరాబాద్ నందినగర్లోని నివాసంలో అందుబాటులో ఉండాలని కేసీఆర్ కు సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని జనవరి 29న 160 సీఆర్ పీసీ కింద సిట్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఉండగా..బంజారాహిల్స్ లోని నందినగర్ లో ఆయన నివాసంలో అధికారులు నోటీసులు అందించారు. జనవరి 30న మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని తెలిపారు. అయితే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విచారణకు హాజరుకాలేనని సిట్ అధికారులకు కేసీఆర్ లేఖ రాశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలని అధికారులకు సూచించారు. అలాగే భవిష్యత్ లోనే ఎలాంటి నోటీసులైనా.. ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ అడ్రస్ కే పంపాలని విన్నవించారు. అయితే కేసీఆర్ వినతిపై న్యాయనిపుణులతో చర్చించిన సిట్ ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. అలాగే ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 3గంటలకు బంజారాహిల్స్ నందినగర్లోని కేసీఆర్ నివాసంలో విచారిస్తామని నోటీసు జారీ చేసింది. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరారు. మరో రోజు విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతానని, విచారణ కోసం వేరే తేదీ నిర్ణయించాలని సిట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలనే దానిపై సిట్ అధికారులు ఈ రోజు సమావేశం నిర్వహించి, న్యాయ నిపుణులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే విచారించాలని నిర్ణయించారు.

## దానం అనర్హతపై స్పీకర్ విచారణ

(మొదటిపేజీ తరువాయి)

పూర్తయ్యింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి వేసిన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ చేపట్టారు. దానంపై అనర్హత వేటు వేయాలని పాడి కౌశిక్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి పిటిషన్‌లు దాఖలు చేశారు. ముందుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. దానం తరఫున న్యాయవాదులు కౌశిక్ రెడ్డిని క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. దానంపై పిటిషన్ ఎందుకు వేశారు?.. పార్టీ మారారని చెప్పేందుకు గల ఆధారాలపై పాడి కౌశిక్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తన వద్ద ఉన్న ఆధారాలను స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అందజేశారు. బీఆర్ఎస్ నుంచి దానం పోటీ చేసి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందడం, ఆ తరువాత కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేయడం, దానం ప్రచార ఫొటోలు, వీడియోలు.. దానం కాంగ్రెస్ కండువా వేసుకున్న ఫొటోలను స్పీకర్ ముందు ఉంచారు పాడి కౌశిక్ రెడ్డి. దీంతో స్పీకర్ ఎదుట పాడి కౌశిక్ రెడ్డి విచారణ ముగిసింది. ఇక, దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై సాక్ష్యాలను అఫిడవిట్ రూపంలో దాఖలు చేశారు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి. మహేశ్వర్ రెడ్డి తరఫు న్యాయవాదులు.. స్పీకర్ ముందు హాజరయ్యారు. దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించేందుకు ఎవిడెన్స్ అఫిడవిట్‌ను పొందుపరిచానని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాను వ్యక్తిగతంగా హాజరుకాలేనని ఆయన తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కావాలంటే సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 20 తరువాత సమయం ఇస్తే తాను విచారణకు వ్యక్తిగతంగా హాజరవుతానని అఫిడవిట్‌లో మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. దీంతో బీజేపీ పిటిషన్‌పై ఫిబ్రవరి 18న స్పీకర్ విచారించనున్నారు. ఇక, పార్టీ ఫిరాయింపుల కేసు కీలక దశకు చేరుకుంది. ఇప్పటివరకూ పది మంది ఎమ్మెల్యేలపై ఆరోపణలు రాగా.. ఎనిమిది మందికి సంబంధించిన విచారణ పూర్తి అయ్యింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి విచారణ జరగాల్సి ఉండగా... దానంను స్పీకర్ విచారించారు. దానం చెప్పే విషయాలను స్పీకర్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. గతంలో ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ సమయంలోనూ ఇదే జరిగింది. విచారణ సమయంలో ఏ పార్టీలో ఉన్నారనే విషయాన్ని ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలను స్పీకర్ ప్రశ్నించగా.. వారంతా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని సమాధానం ఇచ్చారు. ఇక దానం నాగేందర్ కూడా మొన్నటి వరకు తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, అవసరమైతే ఉపఎన్నికకు వెళ్లేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే గత రెండ్రోజులుగా దానం యూటర్న్ తీసుకున్న పరిస్థితి. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, పార్టీకి ఇంకా రాజీనామా చేయలేదని చెప్పుకొచ్చారు. స్పీకర్ తనపై అనర్హత వేటు వేస్తే.. ఉప ఎన్నికకు సిద్ధమని దానం పదేపదే చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# తెలంగాణ ప్రాజెక్టులకు పాతర

(మొదటిపేజీ తరువాయి)

ఇంజినీర్ దొరకలేదా..? దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు చేస్తున్నారు. పోనుపోను అంటూనే మీటింగ్‌లకు అటెండ్ కావడం ఏమిటి..? తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్పజెప్పడమే మీ చర్చల లక్ష్యమా..?' అని ప్రశ్నించారు. సమైక్య పాలనలో మనకు నీటి వాటాల్లో తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ.. నేడు మరో చారిత్రక ద్రోహం చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఇవాల్టి ఇరిగేషన్ మీటింగ్ ద్వారా రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు తెలంగాణకు మరణశాసనం రాయబోతున్నదని చెప్పారు. పోలవరం నల్లమలసాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తున్నది. ఆ కుట్రల తీరును ఒకసారి గమనించండి. పోను పోను అనుకుంటూనే ÷శివంత్ రెడ్డి నాడు ఢిల్లీ మీటింగ్‌కు వెళ్లాడు. ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ జరిపాడు. పెట్టబోను అంటూనే సంతకంపెట్టి తెలంగాణ జలాల హక్కులను కాలరాశాడు. వేయ ను అంటూనే కమిటీవేసి ఏపీ జలదోపిడీకి రెడ్ కార్పెట్ వేశాడు. టెండర్ చివరి తేదీ అయిపోయాక సుప్రీంకోర్టుకు వెళ్ళి నల్లమలసాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపాడు. పసలేని రిట్ వేసి పరిపూర్ణంగా నల్లమలసాగర్‌కు మద్దతు ప్రకటించాడు' అని రేవంత్ కుట్రలను వెల్లడించాడు. చంద్రబాబుకు రేవంత్ గురుదక్షిణ చెల్లిస్తున్నడు. ఏపీ ఒత్తిడితో ఇవాళ జరుగుతున్న ఢిల్లీ మీటింగ్‌లో ఇంజినీర్లు పాల్గొంటున్నారు. ఇది పేరుకు జలవివాదాల మీటింగ్ కానీ, మన 200 టీఎంసీల నీటిని గంపగుత్తగా తరలించుకుపోయే నల్లమలసాగర్ అనే ప్రాజెక్టుకు సంబంధించిన కుట్ర. ఇలాగే గతంలో కేంద్ర జలశక్తి శాఖ



నిర్వహించిన సమావేశంలో ఏపీ ఈ ప్రాజెక్టునే ఏకైక ఎజెండాగా ముందుపెట్టింది. ఇప్పుడు కూడా ఏపీ పాలకులు నల్లమలసాగర్ లింకు ప్రాజెక్టునే తెరమీదకు తెచ్చి చర్చ చేస్తున్నరు' అని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో గోదావరిలో 400 టీఎంసీలకు కేంద్రం నుంచి అనుమతులు తెచ్చారు. గోదావరి మీద 10 డీపీఆర్‌లు పంపి.. 7 ప్రాజెక్టులకు అనుమతులు సాధించారు. రెండేళ్లలో ఒక్క డీపీఆర్ పంపింది లేదు. ఒక్క అను మతి తెచ్చింది లేదు. వార్ధా, కాళేశ్వరం మూడు టీఎంసీలకు సగం అనుమతులు వస్తే, పూర్తి చేయకుండా డీపీఆర్‌లు వాపస్ చేసింది. రేవంత్‌ొండ్డి పాలనలో డీపీఆర్‌లు వాపస్ వచ్చిన పరిస్థితి. నువు మన డీపీఆర్‌లు వాపస్ తెచ్చుకుంటవు, నల్లమలసాగర్‌కు జెండా ఊపుతవు. అలాంటి చంద్రబాబుతో దోస్తీ కట్టి, తెలంగాణకు తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమైన రేవంత్ రెడ్డీ నిన్ను తెలంగాణ సమాజం క్షమించదు' అని హరీష్ రావు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నీటిని ఒడిసిపట్టింద్రని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి విడిచిపెట్టిండని హరీశ్‌రావు మండిపడ్డా రు. ఏపీ పాలకులతో కలిసి తెలంగాణకు జలద్రోహం చేస్తున్నడని విమర్శించారు. రేవంత్‌రెడ్డి దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని హెచ్చరించారు. కేసీఆర్ పాలన గురించి ఎకనామిక్ సర్వే రిపోర్టే స్పష్టం చేసింది. తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించింది. రెండు కోట్ల 20 లక్షల ఎకరాలు మాగాణిగా మారింది. కాళేశ్వరం, మిషన్ కాకతీయ ద్వారా అద్భుతమైన ఆయకట్టు వచ్చింది. కాళేశ్వరం ద్వారా 17 లక్షల 823 ఎకరాల స్థిరీకరణ, మిషన్ కాకతీయ ద్వారా పదిహేను లక్షల ఎకరాల ఆయకట్టు సాధ్యమైంది. 32 లక్షల ఎకరాల ఆయకట్టు బీఆర్ఎస్ సాధించింది' అని మాజీ మంత్రి చెప్పారు. 'బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇప్పటికైనా నోరు పారేసుకోవడం మానుకుంటే మంచిది. కేంద్రంలోని మీ ప్రభుత్వమే తెలంగాణ ప్రగతిప థాన్ని వివరించింది. కళ్లు తెరవండి అనవసరంగా బీఆర్ఎస్ మీద నోళ్లు పారేసుకోకండి' అని హరీశ్‌రావు బీజేపీ నేతలకు హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఢిల్లీ మీటింగ్‌ను బాయ్‌కాట్ చేయాలని డిమాండ్ చేశారు. పాలకులకు ఢిల్లీకి, దావోస్‌కు తిరగడమే తప్ప పాలన మీద దృష్టి లేదని విమర్శించారు. బీఆర్ఎస్ సేద్యంపై దృష్టిసారిస్తే, రేవంత్ చోద్యం చూస్తున్నడని ఆరోపించారు.

## ఆర్థికమంత్రిగా నిర్మలమ్మ రికార్డు

ఇది. పార్లమెంటులో 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మాజీ మంత్రి పి.చిదంబరం సొంతం. 1996లో అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవగౌడ సారథ్యంలో మంత్రి చిదంబరం తొలిసారిగా బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఆ తరువాత 1997లో రెండోసారి, 2004-08 మధ్య కాలంలో వరుసగా ఐదు సార్లు, 2013, 2014ల్లో మరో రెండు సార్లు ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇక లోక్‌సభలో అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేసిన మంత్రిగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. భారత్‌కు సంబంధించిన తొలి బడ్జెట్‌ను 1860లో అప్పటి ఆర్థిక మంత్రి జేమ్స్ విల్సన్ ప్రవేశపెట్టారు. భారత మండలి సభ్యుడిగా ఆయన ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. 1857 సిపాయి తిరుగుబాటు అనంతరం, భారత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల పేరిట వలసపాలకులు ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక స్వాతంత్ర్యానంతరం, 1947 నవంబర్ 26న భారత దేశ ఆర్థిక మంత్రి ఆర్‌కే షణ్ముఖం చెట్టి తొలి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అత్యధిక సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డును మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ సొంతం చేసుకున్నారు. మొత్తం 10 బడ్జెట్‌లను ఆయన పార్లమెంటు ముందుకు తెచ్చారు. 1959-64 మధ్యకాలంలో ఆర్థిక మంత్రిగా ఆరు సార్లు, ఆ తరువాత 1967-1969 మధ్య మరో నాలుగు సార్లు ప్రవేశపెట్టారు. ఇక ప్రణబ్ ముఖర్జీ కూడా వివిధ సందర్భాల్లో మొత్తం 8 బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. 1982-84 మధ్యకాలంలో వరుసగా మూడు సార్లు, ఆ తరువాత 2009-12 మధ్య వరుసగా ఐదు సార్లు బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వరుసగా ఐదు సార్లు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇప్పుడు తొమ్మిదోసారి నిర్మలమ్మ బడ్జెట్‌తో ముందుకు రానున్నరు. ఈ మూడేళ్లు ఆమె ఆర్థికమంత్రిగా కొనసాగితే రికార్డు సృష్టించడం ఖాయం.



## జనసంద్రమైన మేడారం

పోలీసులు నిర్లక్ష్యం వహించారని.. వారంతా వీవీఐపీలు, పోలీస్ కుటుంబాల సేవల్లో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో జాతరకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ÷శిడారం ఉత్సవాల్లో భాగంగా బుధవారం.. సారలమ్మ, గురువారం.. సమ్మక్కలు గద్దెపైకి చేరుకున్నారు. దీంతో మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమై నట్లయింది. గురువారం అర్ధరాత్రి నుంచి వనదేవతలకు భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువెల్ ఓరమ్ మేడారం విచ్చేసి.. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరకు వీఐపీలు, వీవీఐపీలు భారీగా తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సారథ్యంలో 25 మంది ఐపీఎస్‌లు అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరుపుకునే ఈ జాతరకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది మేడారం తరలివస్తున్నారు.

## వెండి ధర 67 వేలు పతనం..

కమోడిటీ ఎక్స్ఛేంజీలో వెండి ఫ్యూచర్స్ (మార్చి డెలివరీ) కిలో 16.97% క్షీణించి రూ.67,891 మేర తగ్గి రూ.3,32,002కు చేరింది. గురువారం రూ.4,20,048 వద్ద వెండి ఆల్‌టైమ్ గరిష్ఠాలను తాకిన సంగతి తెలిసిందే. దీంతో పోలిస్తే వెండి ధర దాదాపు రూ.90వేలు పతనం అయ్యింది. అటు బంగారం ఫ్యూచర్స్ (ఫిబ్రవరి కాంట్రాక్ట్) 10 గ్రాములు 9% క్షీణించి రూ.15,246 తగ్గి రూ.1,54,157కు చేరింది. గురువారం రూ.1,80,779 వద్ద గరిష్ఠాలను తాకింది. గరిష్ఠాల వద్ద ఇన్వెస్టర్లు భారీ ప్రాఫిట్ బుకింగ్‌కు దిగడంతో బంగారం, వెండి ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌లో కమోడిటీ అనలిస్ట్ మనవ్ మోదీ పేర్కొన్నారు. ఫ్యూచర్స్‌తో పోలిస్తే ఈటీఎఫ్ ధరలు మరింత పతనం అయ్యాయని తెలిపారు. దేశీయ మార్కెట్‌లో గోల్డ్, సిల్వర్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు 20 శాతం మేర కుంగాయి. మరోవైపు ఫెడ్ తదుపరి చీఫ్‌గా ఆ విభాగం మాజీ అధికారి కెవిన్ వార్ష్‌ను నామినేట్ చేస్తారన్న వార్తలూ బంగారం, వెండి ధరలు దిద్దుబాటుకు మరో కారణం. జెరోమ్ పావెల్‌తో పోలిస్తే కఠిన మానిటరీ పాలసీ అనుసరిస్తారని, డాలర్ విలువను బలోపేతం చేస్తారన్న అంచనాలతో బంగారం, వెండిపై ఒత్తిడి పడినట్లు సమాచారం. అందరూ ఊహించినట్లుగానే కెవిన్ వార్ష్‌నే తదుపరి ఫెడ్ చీఫ్‌గా ట్రంప్ ప్రకటించారు.

### ఐపిఎస్ అధికారిపై

## ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

- క్షమాపణలు చెప్పాలని అధికారుల సంఘం డిమాండ్
- బేషరతుగా క్షమాపణలు చెప్పిన కౌశిక్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 30 :** తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఎవరినీ ఉద్దేశ్యపూర్వకంగా అన్న మాటలు కాదు.. మనోభావాలు దెబ్బతింటే క్షమాపణలు చెబుతున్నాను. సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్బలంతో నాపై, నా కుటుంబం పై రాజకీయ కక్షకు తెగబడ్డారు. పోలీసులు, అధికారులు అంటే నాకు ఎంతో గౌరవం ఉంది. కానీ కొందరు.. మేము సమ్మక్క జాతరకు వెళ్తున్న క్రమంలో అడ్డుకొని, తీవ్ర ఒత్తిడికి గురి చేశారు. ఆ ఫ్రస్టేషన్, ఒత్తిడిలో తెలియకుండా నోరు జారాను. అంతే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా అన్న మాటలు కావు. నా మాటలతో ఎవరివైనా మనోభావాలు దెబ్బతింటే వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను. ఈ విషయంలో కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని అందరిని వేడుకుంటున్నాను.' అని అభ్యర్థిస్తూ కౌశిక్ రెడ్డి వీడియో విడుదల చేశారు. గురువారం నాడు వీణవంకలోని స్థానిక సమ్మక్క సారలమ్మ జాతరకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లారు. ఆ సమయంలో పోలీసులకు, కౌశిక్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సహనం కోల్పోయిన కౌశిక్ రెడ్డి.. ఐపీఎస్ అధికారిని మతం పేరుతో దూషించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం.. కౌశిక్ రెడ్డి తీరును తీవ్రంగా ఖండించింది. ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని.. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో స్పందించిన కౌశిక్ రెడ్డి.. పోలీసులకు క్షమాపణలు చెబుతూ ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేశారు. తన వ్యాఖ్యల పట్ల వివరణ ఇచ్చారు. తన క్షమాపణల అనంతరం ఈ వివాదాన్ని ఇక్కడితో ముగించాలని కౌశిక్ రెడ్డి కోరారు. అయితే ఐపీఎస్ అధికారిపై బీఆర్ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ పేర్కొంది. మతం పేరుతో ఆరోపణలు చేయడం దారుణమని చెప్పుకొచ్చింది. కరీంనగర్ సీపీ గౌస్ ఆలంపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. విధుల్లో నిబద్ధతతో పనిచేస్తున్న అధికారిపై వ్యక్తిగత దాడి చేశారని అసోసియేషన్ మండిపడింది. మత మార్పిడుల ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవని తెలంగాణ ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ ఘటన సివిల్ సర్వీస్ అధికారుల మనోబలాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని తెలిపింది. ఎమ్మెల్యే ప్రవర్తనపై తక్షణ విచారణకు డిమాండ్ చేసింది. ఎమ్మెల్యే నుంచి బహిరంగ క్షమాపణ కోరింది. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారి మత మార్పిడికి ప్రయత్నిస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తూ.. అతని మతం గురించి చేసిన ఆరోపణలతో తీవ్రంగా కలత చెందుతున్నామని పేర్కొంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి క్షమాపణలు తెలిపారు.

## తెలంగాణలో ముగిసిన మున్సిపల్ నామినేషన్ల ఘట్టం

అప్పటికే క్యూలైన్‌లలో ఉన్నవారు నామినేషన్‌లు వేసేందుకు అనుమతించారు. శనివారం అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్‌ల ఉపసంహరణకు ఫిబ్రవరి 3 వరకు గడువు విధించారు. కాగా ఫిబ్రవరి 11న రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరగనుంది. మొత్తం 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 13న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. మున్సిపల్ ఎన్నికల ఫిర్యాదులకు రాష్ట్ర ఎన్నికల సంఘం 'టీఈ పోల్' మొబైల్ యాప్ ఏర్పాటు చేసింది. వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులకు అవకాశం కల్పించినట్టు ఎస్ఈసీ తెలిపింది. చివరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. సాయంత్రం 5 గంటలకు నామినేషన్ గడువు మగియగా.. అప్పటి వరకు క్యూలైన్‌లో ఉన్న వారిని నామినేషన్ వేసేందుకు అనుమతించారు. శనివారం అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఫిబ్రవరి 3 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది.అదే రోజు ÷నైల్ అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తుంది ఈసీ. మొత్తం 2,996 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తుండగా.. 8203 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓట్ల కౌంటింగ్ కోసం 136 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 3 వరకు విత్ డ్రాలు నిర్వహించి అదే రోజు అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో 48 గంటల ముందే ప్రచారం ముగుస్తుంది. అంటే వచ్చే ఫిబ్రవరి 9వ తేదీన ప్రచారం బంద్ అవుతుంది. ఈ లెక్కన అభ్యర్థులు కేవలం ఆరు రోజులు మాత్రమే ప్రచారం చేయాల్సి ఉంటుంది. చివరిరోజు గజ్వేల్‌లో బిజెపి అభ్యర్థి నామినేషన్‌లో మెదక్ ఎంపి రఘునందన్ రావు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

## నాంపల్లి ఫర్నీచర్ షాప్ అగ్నిప్రమాదం

**కంటతడి పెట్టిస్తున్న మృతుడి ఫోన్ కాల్ ఆడియో**

**హైదరాబాద్, జనవరి 30 :** నాంపల్లి ఫర్నీచర్ షాపులో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నెల 24న షాపులోని సెల్లార్‌లో చెలరేగిన మంటల్లో చిక్కుకుని ఐదుగురు మరణించారు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించి ఒక బాధితుడి కాల్ రికార్డింగ్ ఆడియో లీకైంది. మృతుల్లో ఒకరైన ఇంతియాజ్ అనే యువకుడు.. అగ్ని ప్రమాదం సంభవించిన తర్వాత తన స్నేహితుడికి ఫోన్ చేసి, రక్షించమని వేడుకున్నాడు. తాను మంటల్లో లోపల చిక్కుకున్నట్లు, బయటకు రావడానికి ఏమీ కనిపించడం లేదని స్నేహితుడికి చెప్పాడు. అందులోంచి బయటకు రావడానికి అన్ని దారులు మూసుకుపోయాయని ఫోన్లో చెప్పాడు. తనతోపాటు పిల్లలు కూడా ఉన్నట్లు తెలిపాడు. ప్రస్తుతం ఇంతియాజ్‌కు సంబంధించిన ఈ ఆడియో వైరల్ అవుతోంది. ప్రాణాలు కోల్పోవడానికి కొద్దిసేపటి ముందు కాల్‌లో అతడి ఆవేదన అందరినీ కలిచివేస్తోంది. చివరి క్షణాల్లో బాధితుల వేదన కూడా రికార్డయ్యింది. ఘటనకు సంబంధించి.. సెల్లార్‌లోని ఫర్నీచర్ షాపులో మంటలు చెలరేగి, భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో లోపల ఉన్న ఐదుగురు అందులో చిక్కుకుపోయారు. చుట్టూ పొగ, మంటల ధాటికి బయటికి రాలేకపోయారు. బయటికొచ్చే ఏ మార్గం లేకపోవడంతో అందులోనే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అందరూ బయటికొచ్చేశారు. లోపల గార్డు యాదయ్య కుమారులు ప్రణీత్, అఖిల్ ఉండిపోయారు. వారిని కాపాడేందుకు ఉస్మాన్ ఖాన్, ఆయన భార్య బేబి, ఇంతియాజ్ వెళ్లారు. చివరకు ఈ ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

# తెలంగాణ నీటి ప్రయోజనాలను వదులుకోం

- పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుపై చర్చే లేదు
- హరీష్ రావు నిజాలు తెలుసుకుని మాట్లాడాలి
- పదేళ్లలో సాగునీటి రంగాన్ని భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్
- మండిపడ్డ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 30 :** కేంద్ర జలసంఘం ఛైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు అంశాన్ని అధికారులు పూర్తిగా వ్యతిరేకించినట్టు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నదీ జలాల్లో తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించేలా అవసరమైన వాదనలను అధికారులు వినిపించారని చెప్పారు. పోలవరం - బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని శుక్రవారం నాటి సమావేశంలో సీడబ్ల్యూసీ ఛైర్మన్ స్పష్టంగా చెప్పారన్న మంత్రి... గతంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా లిఖితపూర్వకంగా తెలిపారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు నీటి వాటాల్లో నష్టం జరిగిందని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ ప్రభుత్వం చుక్క నీరు కూడా వదులుకోదని.. తెలంగాణ నీటి హక్కుల కోసం సర్వశక్తులు ఒడ్డుతూ పోరాడుతున్నట్లు వివరించారు. నీటి వాటాలపై చర్చలకు తాము సిద్ధమేనని అన్నారు. దిల్లీ సమావేశం గురించి మాజీమంత్రి హరీశ్ రావు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని ఉత్తమ్ సూచించారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేవలం 60, 70 టీఎంసీలను మాత్రమే వ్యవసాయానికి ఉపయోగించారని.. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేసిన బీఆర్ఎస్ నేతలు తమను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు. ఆదిత్యనాథ్ దాస్ గురించి పదేపదే మాట్లాడడం తగదన్న ఆయన... తెలంగాణ ప్రాజెక్టులపై పూర్తి అవగాహన ఉన్నందుకే ఆదిత్యనాథ్ దాస్‌ను ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకున్నట్లు వివరించారు. కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ సమావేశం దాదాపు రెండు గంటల ఈ భేటీ సాగింది. ఈ అంశంపై తెలంగాణ ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి 12 అంశాలు చర్చించాలని ప్రతిపాదించామన్నారు. పోలవరం నల్లమల్ల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టొద్దని స్పష్టం చేసినట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య పలు జల వివాదాలు ఉన్నాయి.. కృష్ణా, గోదావరి జలాలపై అనేక అంశాలు ఉన్నాయి, అందుకే సమావేశానికి వచ్చామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీ తన అజెండాను చెప్పలేదని.. తదుపరి సమావేశం సీడబ్ల్యూసీ నిర్ణయిస్తుందన్నారు. అనంతరం.. ఈ అంశంపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. 'ఒక్క చుక్క నీరు కూడా వదులుకోం. ఢిల్లీలో జరిగిన మీటింగ్ గురించి హరీష్ రావు తెలుసుకుని మాట్లాడాలి.. మన నది జలాలను కాపాడుకోవడానికి ఎవరితోనైనా చర్చలకు సిద్ధం.. కానీ చుక్క నీరు కూడా వదులుకునేది లేదు.. తెలంగాణ అధికారులు.. నల్లమల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టడానికి ఒప్పుకోమని స్పష్టం చేశారు.. ఇంటర్ స్టేట్ ఇష్యూలు అజెండాలో పెట్టాలని కేంద్రానికి చెప్పారు. పోలవరం.. నల్లమల సాగర్ కి అనుమతి లేదని కేంద్ర మంత్రి నాకు లేఖ రాశారు.. ఇవాళ జరిగిన మీటింగ్ లో కూడా సీడబ్ల్యూసీ ఇదే చెప్పింది.. పదేళ్ళ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి కట్టిన ప్రాజెక్టు కూలింది.. ఆ నాయకులు సిగ్గుపడాలి.. పదేళ్లలో ఎస్ఎల్‌బిసి పూర్తి చేయలేదు.. డిండి ప్రాజెక్టు పూర్తి చేయలేదు.. పదే పదే అబద్దాలు చెప్పి? నిజం చేయాలని అనుకుంటున్నారు.. పదేళ్ల లో కంటే ఈ రెండేళ్లలో ఎక్కువ నీటి వినియోగం, వరి దిగుబడి వచ్చిందని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.



## తెలంగాణలో ఏమీ సాధించుకోలేక పోయాం

### సమ్మక్క జాతరలో కవిత ఆవేదన

**ములుగు, జనవరి 30 :** తెలంగాణ ఏర్పడిన తర్వాత 12 ఏండ్లలో ఏమీ సాధించుకోలేక పోయామని మాజీ ఎమ్మెల్సీ,తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో వేటిని కూడా సంపూర్ణంగా సాధించుకోలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం కూడా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేడారంలో సమ్మక్క, సారలమ్మను ఆమె దర్శించుకున్నారు. అంతకు ముందు గట్టమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిలువెత్తు బంగారాన్ని అందించి మొక్కులు తీర్చుకున్నా రు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. అమ్మవార్లు వారి జాతి కోసం చేసిన పోరాటం చరిత్రాత్మకమని చెప్పారు. ఇవాళ తెలంగాణ జాతి కోసం అందరం నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. మన హక్కులను సాధించుకునేందుకు సమ్మక్క, సారలమ్మ స్ఫూర్తితో పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. తల్లుల దయతో తెలంగాణ బాగుండాలని కోరుకుంటున్నట్టు ఆమె తెలిపారు.

## ఏప్రిల్ 19న మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష

**హైదరాబాద్, జనవరి 30 :** తెలంగాణ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకొరకు ఇప్పటికే అడ్మిషన్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఆరవ తరగతినుంచి 10 వ తరగతి వరకు అడ్మిషన్లకు పరీక్ష నిర్వహించను న్నారు. జనవరి28 నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఏప్రిల్ 19న మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. మోడల్ స్కూళ్లలో ప్రవేశ పరీక్ష రాయాలనుకునే విద్యార్థులు ఓబీసీలు రూ.200లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ విద్యార్థులు రూ.125 లు పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 19న ప్రవేశ పరీక్ష రెండు దఫాలుగా నిర్వహిస్తారు. ఉదయం 10గంటల ఉంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరవ తరగతి విద్యార్థులకు, 7తరగతినుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు.

## ఎడ్ సెట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన శ్రీధర్ బాబు

**హైదరాబాద్,జనవరి30 :** టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు ప్రసారం చేసే ఎడ్ సెట్ ప్రసారాల షెడ్యూల్ పోస్టర్ ను రాష్ట్ర ఐటి, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. సచివాలయంలోని తన ఛాంబర్ లో టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తో కలిసి ప్రసారాల వివరాలు తెలిపే షెడ్యూల్ పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ ఎడ్ సెట్ లో ఉన్నతమైన ర్యాంకులు సాధించేందుకు టి-సాట్ అందించే డిజిటల్ కంటెంట్ ను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా బీఈడీ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యకు ప్రత్యేక ప్రధాన్యత నిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. టి-సాట్ కంటెంట్ సోషల్ మీడియా ఎ÷-లాట్ ఫాం ద్వార అందుబాటులో ఉంటుందని, తద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. తెలంగాణా ప్రభుత్వం నిర్వహించే ప్రతి పోటీ పరీక్షకు టి-సాట్ అందించే డిజిటల్ కంటెంట్ ను సద్వినియోగం చేసుకోవాలని, మే నెలలో జరిగే ఎడ్ సెట్ పరీక్ష కోసం అభ్యర్థులను సిద్ధం చేసేందుకు ఫిబ్రవరి రెండవ తేది నుండి మే 11వ తేది వరకూ రోజుకు నాలుగు గంటల పాటు 392 ఎపిసోడ్స్ ప్రసారం చేస్తున్నామన్నారు మంత్రి శ్రీధర్ బాబు. .బయాలజీ, పిజికల్ సైన్స్, మాథమేటిక్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్, తెలుగు స్జబెక్టులతో 98 రోజుల పాటు టి-సాట్ విద్య, నిపుణ ఛానళ్లతో పాటు టి-సాట్ యాప్, యూట్యూబ్ లో ప్రసారాలు కొనసాగుతాయి. పోటీ పరీక్షలకు డిజిటల్ కంటెంట్ అందించేందుకు కృషి చేస్తున్న సీఈవో వేణుగోపాల్ రెడ్డిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టి-సాట్ ఎగ్జుక్యూటీవ్ డైరెక్టర్ ఎం.డి సాధిక్ పాల్గొన్నారు.






## మేడారంలో ఎమ్మెల్యే తలసాని మొక్కులు

**ములుగు, జనవరి 30 :** మేడారంలో సమ్మక్క, సారక్క జాతర వైభవంగా కొనసాగుతుంది. జాతర అమ్మవార్లను దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం మేడారం జాతరను సందర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి సమ్మక్క, సారక్కను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బంగారం సమర్పించి అమ్మవార్లను వేడుకున్నారు. జాతరలో మంత్రి సీతక్క ఎమ్మెల్యేను ఆపార్యంగా పలకరించారు. సీతక్క వారికి అమమవారి దర్శనం చేయించారు.

# వెదురు కర్రలే దైవాలుగా..

# గద్దెలే గర్భగుడులుగా

- కోట్లాది హృదయాలను ఏకం చేస్తున్న జాతర
- మేడారం మహా జాతరకు ప్రముఖుల రాక
- గవర్నర్, డిజిపి, మంత్రుల దర్శనాలు



**మేడారం, జనవరి 30 :** వెదురు కర్రలే దైవాలుగా, గద్దెలే గర్భగుడులుగా, పసుపు,కుంకుమలే వజ్రాభరణాలుగా, బెల్లమే నిలువెత్తు బంగారంగా, ఒడిబియ్యమే పరమాన్నంగా, చీర ముక్కరైక బట్టలే సారెలుగా మారి తల్లులకు సమర్పించే అపూర్వ ఆధ్యాత్మిక మహోత్సవం మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర భక్తి పారవశ్యంతో అట్టహాసంగా కొనసాగుతోంది. వన దేవత మన దేవత జన దేవత అంటూ అపార విశ్వాసంతో కోట్లాది భక్తుల హృదయాలను ఏకం చేసే ఈ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జాతరకు దేశం నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తజనం మేడారానికి తరలివస్తున్నారు. జాతర ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడుతోంది. ఎటు చూసినా భక్తులే దర్శనమిస్తున్నారు. క్రమబద్ధంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో భక్తుల బారులు దర్శనానికి ఎదురుచూస్తుండగా, ప్రశాంత వాతావరణంలో తల్లుల దర్శనాలు సజావుగా కొనసాగుతున్నాయి. భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాయి. ట్రాఫిక్ నియంత్రణ, క్యూ లైన్ నిర్వహణ, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు.జంపన్న వాగులో పుణ్యస్నానాలతో భక్తుల సందడి నెలకొనగా, గద్దెల వద్ద భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. జాతర ప్రాంగణం అంతటా వైద్య బృందాలు అప్రమత్తంగా సేవలందిస్తుండగా, క్యూ లైన్ల వద్ద వాలంటీర్లు నిరంతరం భక్తులకు సహకారం అందిస్తున్నారు. భక్తుల రద్దీని తట్టుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు సమర్థంగా కొనసాగుతున్నాయి.మేడారం మహా జాతరకు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సుమారు 500 మంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు సేవలందిస్తున్నారు. సమ్మక్క?సారలమ్మ గద్దెల వద్ద, క్యూ లైన్లలో భక్తులకు సహాయం చేయడం, జంపన్న వాగు వద్ద సూచనలు ఇవ్వడం, తప్పిపోయిన భక్తులను శిబిరాలకు చేర్చడం వంటి సేవలతో వాలంటీర్లు జాతరలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు శ్రీ సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తల్లులను దర్శించుకున్నారు. మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ అమ్మవార్లను దర్శించుకున్నారు .మంత్రి శ్రీమతి సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, గండ్ర సత్యనారాయణ అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ ఓవెన్ సమ్మక్క-సారలమ్మలకు తులాభారం సమర్పించి తల్లులను దర్శించుకున్నారు .ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి దర్శనాలు మరింత సులభంగా, వేగంగా జరుగుతున్నాయని, భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు.







## తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాల సాధనకు కృషి

- అన్ని శాఖలు నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగాలి
- వ్యవసాయ, మత్స్య, కార్మిక శాఖలతో సిఎస్ సమీక్ష

**హైదరాబాద్,జనవరి 30 :** తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల మేరకు అన్ని ప్రభుత్వ విభాగాలకు దిశానిర్దేశం చేసేందుకు గత మూడు రోజులుగా విభాగాల వారీగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఈ రోజు వ్యవసాయం, సహకార, పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్య, అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక, ఆహార, పౌర సరఫరాల, కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, జి.ఎ.డి సర్వీసెస్ శాఖలపై డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికను దృష్టిలో పెట్టుకొని నిర్ధేశిత లక్ష్యాలను చేరుకోవాలని అదే విధంగా భవిష్యత్ లో యూరియా, ఎరువుల పంపిణీని ఐటి ఆధారిత సేవల ద్వారా పటిష్టంగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హార్టికల్చర్ శాఖలలో అమలవుతున్న పథకాలపై సమీక్షించారు. ఆయిల్ పామ్ ఎ÷-లాంటేషన్, ప్రజల అవసరాల మేరకు పండ్లు, కూరగాయల పెంపకం విస్తృతంగా ప్రోత్సహించాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం హైబ్రిడ్ మోడ్ లో భాగంగా చేపట్టిన రంగారెడ్డి జిల్లా కోహెడ మార్కెట్ నిర్మాణ పనులపై సమీక్ష చేశారు. అదే విధంగా రాష్ట్రంలో రైతుల సంక్షేమం, పంటల దిగుబడి, రైతు సమస్యల పట్ల వ్యవసాయ శాఖ నిరంతర మానిటరింగ్ చేయాలని డిజిటల్ క్రాప్ సర్వే కూడా నిర్వహించాలని సూచించారు. రాబోయే సాగు కాలానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు తగినంతగా అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను సి.ఎస్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా స్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సహకార సంఘాల పనితీరు, రైతు సహకార సంఘాల ఆర్థిక స్థితి, రుణాల పంపిణీ పై సమీక్ష చేశారు. సహకార సంఘాలను మరింత పటిష్టం చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పారదర్శకతతో కూడిన వ్యవస్థను అమలు చేయాలని, రైతుల విశ్వాసాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలవుతున్నాయా లేదా అన్నదానిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, సమస్యలు ఎదురైన చోట వెంటనే పరిష్కరించాలని సి.ఎస్ స్పష్టం చేశారు.పశు సంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్యశాఖ : అనంతరం పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్యశాఖలపై సి.ఎస్ సమీక్షించారు.

# వాస్తవ పరిస్థితులను బడ్జెట్ గుర్తించేనా?




**ఏటేటా బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వే ప్రవేశ పెట్టడం, దానిపై పెద్దగా పట్టింపు లేకుండా బడ్జెట్ ప్రవేశ పెట్టడం..తూతూ మంత్రంగా సాగిపోతోంది. దేశంలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని బడ్జెట్ ప్రతిపాదనలు రావడం లేదు. మూడో ఆర్థిక శక్తిగా ఎదగాలన్న మాటలకు చేతలకు పొంతన లేకుండా పోతోంది. నిజం చెప్పాలంటే ప్రజలను మభ్యపెట్టడబం తప్ప, వాస్తవాలను పాలకులు గ్రహించడం లేదు. ప్రపంచ ఆర్థిక మాంద్యం తరుముకు వస్తున్న వేళ దేశీయంగా దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదు. యువతకు చేతినండా పిన కల్పించడం, ధరలను అదుపు చేయడం, నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడం వంటి చర్యలను గుర్తించడం లేదు. అమెరికా వీసాల కట్టడితో మనదేశం నుంచి వెళుతున్న నిరుద్యోగులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. అక్కడా ఉద్యోగాల కల్పన అన్నది భ్రమగా మారింది.**

ప్రపంచంలో డాలర్ పతనం ప్రారంభం అయ్యింది. ఈ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ట్రంప్ సుంకాల కారణంగా మాన మార్కెట్లు కుదేలవుతున్నాయి. దీనిపైనా ముందస్తు వ్యూహం ఉండాలి. చెప్పాలంటే ప్రతికూల పరిస్థితుల్లో దేశం ముందుకు వెళ్లే ప్రయత్నాలు సాగాలి. మన ఉత్పత్తులను మనం ఉపయోగించే పరిస్థితి రావాలి. దేశంలోని యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా వస్తూత్పత్తిని పెంచుకోవచ్చు. ధాన్యం దిగుబబడులకు అనుగుణంగా మార్కెట్ లేదు. ఇవన్నీ కూడా బడ్జెట్‌లో ఎప్పుడూ చర్చించడం లేదు. ప్రస్తుతం అంటే ఫిబ్రవరి1న ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో చర్చిస్తారా అన్నది చూడాలి. మనకున్న సహజ వనరులను, మానవనరులను ఎలా జోడించి వినియోగించుకోగలమో అన్న ప్రణాళిక లేకుండా బడ్జెట్ ప్రతిపాదనలు సాగుతున్నాయి. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని పరితపిస్తున్న భారత్ ఒకవైపు అవకాశాలు, మరోవైపు ముప్పులు పొంచివున్నట్లు జాతీయ ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. అంతర్జాతీయం గా ఆర్థిక అనిశ్చితి నెలకొన్న పరిస్థితుల్లోనూ భారత్ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.4 శాతం వృద్ధిరేటు సాధిస్తుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ముఖ్యంగా ప్రపంచాన్ని ఊపేస్తున్న ఏఐ విప్లవాన్ని అందిపుచ్చు కుంటే అమెరికా తర్వాత అత్యధిక ఏఐ లిటరేట్స్ ఉన్న భారతదేశం జీడీపీ పరంగా ఎక్కడికో వెళ్లిపోతుందని అంచనా వేస్తోంది. కంపెనీలన్నీ ఏఐ రంగంలో లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు కుమ్మరించిన నేపథ్యంలో ఏమైనా తేడా వస్తే మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 2008 తరహా సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా జరిగే అవకాశం 10 నుంచి 20 శాతం వరకు ఉందని, దాన్ని విస్మరించలేమ ని చెప్పింది. అదే జరిగితే మనుగడ పోరాటంలో భాగంగా మహామహా ఐటీ కంపెనీలు పెట్టే బడ్జెట్ కోతల్లో ప్రధానంగా సమిధలయ్యేది భారతీయవైట్ కాలర్ ఉద్యోగులేనని హెచ్చరించింది.

ఏఐ అమల్లోకి వచ్చిన 2022 నుంచే రొటీన్ ఉద్యోగాల కోతలు మొదలయ్యాయని, ఆర్థిక సంక్షోభం ఖాయమైతే తీవ్రత ఊహించలేని విధంగా ఉంటుందని అప్రమత్తం చేసింది. కేంద్రం ఏఐ ఆర్థిక మండలిని ఏర్పాటు చేసి, ఉద్యోగాలను కాపాడుకొనే మార్గాలను అన్వేషించాలని పిలుపునిచ్చింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటులో ఎకనామిక్ సర్వేను ప్రవేశ పెట్టారు. దీని ప్రకారం.. 2026-27 ఆర్థిక సంవత్సరం లో భారతదేశపు ఎకానమీ 6.8 శాతం నుండి 7.2 శాతం మధ్య వృద్ధి చెందుతుందని అంచనా వేశారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం స్థిరంగా దూసుకుపోతుండటం విశేషం. మన దేశ సంభావ్య వృద్ధి రేటు సుమారు 7 శాతంగా ఉంటుందని సర్వే పేర్కొంది. దేశీయ డిమాండ్.. వృద్ధికి వెన్నెముక ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు కొంత ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, భారతదేశం అంతర్గత బలాలు ఆర్థిక వ్యవస్థను కాపాడుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం పెరగడం, వ్యవసాయ రంగం మెరుగైన ప్రదర్శన కనబరచడం వృద్ధికి ప్రధాన కారణాలుగా మారాయి. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. ప్రభుత్వం చేపట్టిన పన్ను హేతుబద్ధీకరణ చర్యల వల్ల సామాన్యుడి చేతిలో ఖర్చు పెట్టడానికి ఎక్కువ డబ్బులు మిగులుతున్నాయని, ఇది దేశీయ మార్కెట్లో వస్తువుల డిమాండ్ పెరగడానికి దోహదపడిందని సర్వే విశ్లేషించింది. అయితే అంతర్జాతీయ మార్కెట్లలో వచ్చే ఒడిదుడుకులను తట్టుకోగలిగేంత పటిష్టమైన బఫర్స్ భారత్ వద్ద ఉన్నాయని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేసింది.

ఆర్థిక క్రమశిక్షణ పాటించడం వల్ల విదేశీ పెట్టుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయని పేర్కొంది. సవాళ్లు , భవిష్యత్తు అంచనాలు వృద్ధి రేటు బాగున్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ట్రేడ్ ఫ్రాగ్మెంటేషన్, ఆర్థిక రంగంలో నెలకొన్న సున్నితమైన పరిస్థితులపై సర్వే హెచ్చరించింది. గ్లోబల్ మార్కెట్లలో వచ్చే మార్పులు మనపై కొంత ఆలస్యంగా ప్రభావం చూపే అవకాశం ఉందని, కాబట్టి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు , స్థిరమైన స్థూల ఆర్థిక విధానాలు మన దేశాన్ని ప్రపంచ ఆర్థిక పటంలో అగ్రస్థానంలో నిలుపుతాయని ఎకనామిక్ సర్వే ఆశాభావం వ్యక్తం చేసింది. విద్యార్థులు ఏఐని విచ్చలవిడిగా వాడటం వల్ల ఆందోళన, కుంగుబాటు పెరిగి సమస్యను పరిష్కరించే సామర్థ్యాన్ని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. మొత్తంగా ఆర్థిక సర్వే ఆశాజనక సూచనలు చేసినా, క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధ పరిస్థితి ఉంది. నిరుద్యోగం తాండవిస్తోంది. పేదరికం ఇంకా పెరుగుతోంది. వీటిని సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఆ మేరకు బడ్జెట్‌లో ప్రతిపాదనలు రావాలి. సమస్యలను చర్చించి, అధిగమించే ప్రయత్నాలు చేపట్టాలి. అప్పుడే ఆర్థికంగా దేశం బలోపేతం కాగలదు.

# బంగారం ధరల్లో ఒడిదుడుకులు

- ఒక్కరోజులోనే 5లక్షల కోట్లకు క్రాష్
- సాయంత్రానికి తిరిగి పుంజుకున్న మార్కెట్



**న్యూఢిల్లీ, జనవరి 30 :** ప్రస్తుతం ఎక్కడ చూసినా బంగారం, వెండి ధరలపై చర్చ సాగుతోంది. అనూహ్యంగా అడ్డూఅదుపుల లేకుండా పెరుగుతున్న ధరలు ఎందాక పోతాయా అన్న ఆందోళన కనిపిస్తోంది. సామాన్యుల నుంచి బడా ఇన్వెస్టర్లు, వ్యవస్థాగత మదుపర్ల వరకూ అన్ని వర్గాల వారినీ పసిడి ధరల పరుగు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఏ రోజు ధర ఎంత పెరుగుతుందో? ఎంత తగ్గుతుందో? అసలు పసిడిపై పెట్టుబడికి ఇది సరైన సమయమో కాదో తెలియక సామాన్యుల తలకిందులవుతున్నారు. అయితే, చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా గురువారం బంగారం మార్కెట్ విలువ తీవ్ర హెచ్చుతగ్గులకు లోనైంది. అంతర్జాతీయ అనిశ్చితులతో గత కొన్ని రోజులుగా అసాధారణంగా పెరుగుతున్న బంగారం ధర.. గురువారం రాత్రి అనూహ్యంగా ఒడుదొడులకు లోనై,గంటల వ్యవధిలో దారుణంగా ఊగిసలాడింది. కేవలం ఒక ట్రేడింగ్ సెషన్‌లోనే పసిడి మార్కెట్ విలువ ఏకంగా 5.5 ట్రిలియన్ డాలర్ల హెచ్చుతగ్గులకు గురైందంటే.. ప్రపంచ కమొడిటీ మార్కెట్ల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు..! ఒక్క రోజులో బంగారం మార్కెట్ విలువ ఈ స్థాయిలో మార్పులు రావడం చరిత్రలో ఇదే తొలిసారి. ని స్టాక్ మార్కెట్ వ్యవహారాల కామెంటరీ వేదిక 'ది కొబేసీ లెటర్' నెట్టింట పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. ది కొబేసీ లెటర్' చేసిన ట్వీట్ ప్రకారం, గురువారం ఉదయం అమెరికా కాలమానం ప్రకారం 9.30 గంటల నుంచి 10.25 గంటల మధ్య బంగారం మార్కెట్ విలువ ఒక్కసారిగా 3.2 ట్రిలియన్ డాలర్ల మేర పడిపోయింది. ఆ తరువాత క్రమంగా కోలుకుని మార్కెట్స్ క్లోజ్ అయ్యే సమయానికి కనిష్ఠ స్థితి నుంచి 2.3 ట్రిలియన్ డాలర్ల మేర ఎగబాకింది. అంటే.. ఒక్క సెషన్‌లోనే బంగారం మార్కెట్ క్యాపిటలైజేషన్ హెచ్చుతగ్గుల విలువ 5.5 ట్రిలియన్ డాలర్లను చేరింది. బంగారానికి ఉన్న వాస్తవ డిమాండ్‌కు మించి ధరల్లో ప్రస్తుతం హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. భౌగోళిక అనిశ్చితులు, డాలర్ బలహీనత, అమెరికా వడ్డీ రేట్లపై అనిశ్చితి వంటి వాటితో పాటు ఇతర కీలక అంశాలు ధరలను ప్రభావితం చేస్తున్నాయని అంటున్నారు. ముఖ్యంగా వ్యవస్థాగత మదుపర్లు కమోడిటీ మార్కెట్స్‌పై దృష్టిపెట్టడం, ఆల్గోరిథమ్-ఆధారిత ట్రేడింగ్ పెరగడం, బంగారం హెచ్చుతగ్గుల ఆధారంగా డెరివేటివ్ మార్కెట్స్‌లో కూడా ట్రేడింగ్ అధికమవడంతో పసిడి ధరలు అంచనాలకు మించి హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. పసిడితో పాటు వెండి, పెలాడియం వంటి విలువైన లోహాలన్నీ ఇదే స్థాయిలో ఒడిదుడుకులకు లోనుకావడం కమోడిటీ మార్కెట్స్‌లో ఒత్తిడికి సూచిక అని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా బంగారం ధరలకు ఈ ఏడాది బ్రేకులు ఉండకపోవచ్చని ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్స్‌లో ఔన్స్ మేలిమి బంగారం ధర 6 వేల డాలర్ల మార్కు దాటొచ్చనేది మెజారిటీ మార్కెట్ విశ్లేషకుల అంచనా. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధాల నేపథ్యంలో కరెన్సీ స్థిరత్వంపై ఆందోళనలు, ద్రవ్యోల్బణ భయాలు, వడ్డీరేట్లపై అస్పష్టత వంటి అనేక కారణాలతో ఈ మధ్య మదుపర్లు బంగారం, వెండి లోహాల్లో పెట్టుబడులను సురక్షిత సాధనంగా భావించారు. దీంతో వీటి ధరలకు రెక్కలొచ్చా యి. అయితే, గరిష్ఠాల వద్ద సంస్థాగత మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో గురువారం వీటి విలువ ఒక్కసా రిగా తగ్గింది. దీనికితోడు కంప్యూటర్ ఆధారిత ఆటోమెటిక్ అల్గారిథమ్ ట్రేడింగ్ కూడా ధరల కదలికలను తీవ్రంగా ప్రభావి తం చేసిందని మార్కెట్ అనలిస్టులు చెబుతున్నారు. నేటి రోజుల్లో బంగారం ట్రేడింగ్ అనేది భౌతిక బంగారం డిమాండ్ మీద మాత్రమే ఆధారపడట్లేదని, ఈటీఎఫ్‌లే మార్కెట్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొంటున్నారు.

# మహాత్మాగాంధీ 78వ వర్ధంతి

## రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పించిన రాష్ట్రపతి, ప్రధాని





**న్యూఢిల్లీ, జనవరి 30 :** మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా రాజ్‌ఘాట్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీసహా పలువురు ప్రముఖులు గాంధీకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, రిటైర్డ్ అధికారులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు కూడా పాల్గొన్నారు. రాజ్‌గాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. ఆయన విలక్షణ వ్యక్తిత్వం, విజయాలు మన దేశస్థులకు ఎల్లప్పుడూ సరైన మార్గాన్ని చూపిస్తూ ప్రేరణగా ఉంటాయి. అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం కోసం మన సంకల్పానికి ఆయన చిహ్నంగా నిలుస్తారని తెలిపారు.మహాత్మా గాంధీ జీవితం నిజాయితీ, సత్యాగ్రహం, అహింసా మార్గదర్శకాలు మరియు సామాజిక న్యాయం కోసం చేసిన ప్రేరణాత్మక ప్రయత్నాలతో గుర్తింపు పొందింది. ఆయన వ్యక్తిత్వం మరియు విజ్ఞానం యువత, ప్రజలకి సామాజిక సమతా, దేశభక్తి మరియు స్వావలంబన పట్ల ప్రేరణగా నిలుస్తాయి. కార్యక్రమంలో గాంధీకి ప్రత్యేక పుష్పాంజలి, ప్రతిమలకు పూల మాలలు, స్మరణీయ ప్రసంగాలు మరియు సంగీత కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భక్తులు, స్థానికులు, పర్యాటకులు కూడా భాగస్వామ్యమై, గాంధీ జీవితం, సూత్రాలు గురించి అవగాహన పెంపొందించుకున్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేసారు.జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పిస్తున్నాను. అహింసా విధానంతో కోట్ల మంది దేశప్రజలను ఒక్కతాటిపై నడిపి స్వాతంత్యం÷-ర సాధించారు. గాంధీజీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలి. స్వదేశీ, మహిళా సాధికారత, గ్రామ స్వరాజ్యం, పేదరిక నిర్మూలన వంటి గాంధీజీ ఆశయాలను నిజం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేద్దామని అన్నారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. 'సత్యం తాత్కాలికంగా ఓడినట్టుగా కనిపించవచ్చు.. కానీ ఎప్పటికీ ఓడదు' అని చెప్పడమే కాక.. తన చివరి శ్వాస వరకు సత్యానికే అంకితమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు మహాత్మా గాంధీ. నేడు జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా నివాళులు' అని వైఎస్ జగన్ ట్వీట్ ద్వారా పేర్కొన్నారు. ఈ ట్వీట్ ద్వారా గాంధీజీ జీవితాన్ని, ఆయన బోధనలను జగన్ గుర్తుచేసుకున్నారు.

# పెళ్లి పేరుతో వేధింపులు

## తట్టుకోలేక మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

**వరంగల్, జనవరి 30 :** ఇద్దరు యువకులు వేధించడం, అవమానించడం తట్టుకోలేక ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సీత్యతండాకు చెందిన అనిత.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. అనితను తొర్రూరు మండలానికి చెందిన దూరపు బంధువు రాజేందర్ పెళ్లి చేసుకుంటానని నాలుగేళ్లుగా చెబుతూ వస్తున్నాడు. ఇటీవల అనిత డ్యూటీలో ఉండగా వీడియో కాల్ చేయమని చెప్పడం, ఎవరితోనో మాట్లాడుతున్నావంటూ రాజేందర్ ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. అతని వేధింపులు తట్టుకోలేక అనిత తన తల్లిదండ్రులతో చెప్పి బాధపడింది. రాజేందర్ పద్ధతి నచ్చక, తమ కూతురుని అతడికి ఇచ్చి పెళ్లి చేయడం కుదరదని తేల్చి చెప్పారు. అయినా అనితను పెళ్లి చేసుకుంటానంటూ బతిమలాడుతూనే ఉన్నాడు. మరోవైపు అనిత తన క్లాస్‌మేట్ అయిన జబ్బార్ లాల్‌ని ప్రేమించడం మొదలుపెట్టింది. ఇద్దరూ పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుందామని భావించారు. ఇటీవల జబ్బార్ కూడా మోసగాడని తేలింది. పెళ్లి చేసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని పదేపదే వేధించడం మొదలు పెట్టాడు. జబ్బార్ వేధింపులు తట్టుకోలేక మనస్తాపానికి గురైన అనిత ఈ నెల 27న రాజేందర్ కు ఫోన్ చేసి 'నువ్వు, జబ్బార్ నా జీవితంతో ఆడుకున్నారు, నన్ను వేధించారు, అవమానించారు, మీ వల్లనే నేను ఆత్మహత్య చేసుకుంటున్నా' అంటూ బాధపడింది. అనితకు ధైర్యం చెప్పాల్సిన రాజేందర్ నిర్లక్ష్యంగా 'చావు.. నీ ఇష్టం' అంటూ ఫోన్ కట్ చేశాడు. దాంతో అనిత తీవ్ర మనస్తాపానికి గురై గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ అనిత కన్నుమూసింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రాజేందర్, జబ్బార్‌లపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# రికార్డు చేసుకో.. మీ అక్కను చంపేస్తున్నా

- బావమరదికి ఫోన్ చేసి మరీ భార్యను చంపిన దుర్మార్గుడు
- స్వాట్ కమాండో హత్య కేసులో దర్యాప్తు



**న్యూఢిల్లీ, జనవరి 30 :** దేశ రాజధాని నగర పోలీసు విభాగంలో స్వాట్ కమాండోగా పనిచేస్తున్న కాజల్ చౌధరి(27)ని ఆమె భర్త అంకుర్ డంబెల్‌తో కొట్టి చంపిన కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. మృతురాలి సోదరుడు నిఖిల్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. హత్యకు సంబంధించిన పలు కీలక విషయాలు వెల్లడించాడు. 'హత్యకు ముందు నా సోదరి కాల్ చేసి, తన భర్త వేధిస్తున్నట్లు చెప్పింది. అదే సమయంలో అక్కడే ఉన్న అంకుర్ ఆమె నుంచి ఫోన్ లాక్కొని రికార్డు చేసి పెట్టుకో.. పోలీసులకు ఆధారంగా పనికొస్తాయి. మీ అక్కను చంపుతున్నా అని బెదిరించాడు. ఆ సమయంలో అతడిని ఎంత సముదాయించడానికి ప్రయత్నించినప్పటికీ నా మాటలు వినలేదు. కొంతసేపటి తర్వాత అంకుర్ కాల్ చేసి, కాజల్ చనిపోయిందని.. గాజియాబాద్ ఆస్పత్రికి వచ్చి చూసుకొమ్మని చెప్పాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి వెళ్లగా గర్భిణి అయిన నా సోదరి మృతిచెంది ఉందని సోదరుడు నిఖిల్ బావురుమన్నాడు. 2023లో అంకుర్‌తో కాజల్ వివాహం అయిన సమయంలో పెద్ద మొత్తంలో కట్నం ఇచ్చామని, అయినా అత్తింటివారు అదనపు కట్నం కోసం తన కుమార్తెను వేధించేవారని మృతురాలి తల్లి ఆరోపించింది. రక్షణశాఖలో క్లర్కుగా పనిచేస్తున్న అంకుర్‌కు ఆర్థికపరమైన అంశాల్లో భార్య కాజల్‌తో తరచూ గొడవలు జరిగేవి. ఈ నెల 22న దంపతుల మధ్య గొడవ తీవ్రరూపం దాల్చడంతో విచక్షణ కోల్పోయిన అంకుర్ ఆమెపై దాడిచేసి, డంబెల్‌తో తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన కాజల్ గాజియాబాద్ ఆసుపత్రిలో అయిదు రోజులు మృత్యువుతో పోరాడి మంగళవారం మృతి చెందగా.. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంకుర్‌ను అరెస్టు చేసిన పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఢిల్లీలోని మోహన్ గార్డెన్ ప్రాంతంలో కాజల్-అంకుర్ నివాసంలో ఈ ఘటన జరిగింది. భర్త.. నిందితుడైన అంకుర్ తన భార్య కాజల్ తలని తలుపు ఫ్రేమ్‌కు బలంగా కొట్టి, ఆపై బరువైన డంబెల్ తో ఆమె తలపై దాడి చేశాడు. దాడి సమయంలో కాజల్ నాలుగు నెలల గర్భిణీ. ఆసుపత్రిలో ఐదు రోజులపాటు మృత్యువుతో పోరాడి, జనవరి 27న కమాండో కాజల్ కన్నుమూశారు. కట్నం వేధింపులే తమ బిడ్డ హత్యకు ప్రధాన కారణమని కాజల్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. నిందితుడు అంకుర్ చౌదరి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖలో క్లర్కుగా పనిచేస్తున్నాడు. పెళ్లిలో బుల్లెట్ బైక్, బంగారం ఇచ్చినప్పటికీ, కారు ఇవ్వలేదని అతను తరచూ కాజల్‌ను వేధించేవాడని తెలుస్తోంది. పోలీసులు.. నిందితుడు అంకుర్ చౌదరిని అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపారు. ముందుగా హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు.. కాజల్ మరణం తర్వాత దానిని హత్య కేసుగా మార్చారు. కాజల్-అంకుర్ దంపతులకు ఇప్పటికే ఒకటిన్నర ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఆ బాబు కాజల్ తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు.

# తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారం

- ప్రభుత్వానికి సిట్ లేఖ రాసినట్లు సమాచారం
- లడ్డూ వ్యవహారంపై వివరాలు వెల్లడించిన సిట్

**అమరావతి, జనవరి 30 :** తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి సిట్ లేఖ రాసినట్లు సమాచారం. జరిగిన పరిణామాలు, దర్యాప్తులో తేలిన అంశాలు లేఖలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. 2019-24 మధ్య లడ్డూ ప్రసాదంలో అనేక తప్పిదాలను సిట్ లేఖలో ప్రస్తావించింది. లడ్డూలో కల్తీ జరిగిందని నిర్ధరించటంతో పాటు భవిష్యత్తు దిద్దుబాటు చర్యలను సూచించినట్లు సమాచారం. సిట్ లేఖను పూర్తిగా అధ్యయనం చేశాక స్పందించాలని ప్రభుత్వ భావిస్తోంది. సిట్ క్లీన్ చిట్ అంటూ ప్రజల్ని వైకాపా తప్పుదోవ పట్టించే యత్నాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. తప్పుడు ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. భక్తుల విశ్వాసం, తితిదే ప్రయోజనాలు కాపాడే విషయంలో రాజీ లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం మరోసారి రాజకీయంగా, పరిపాలనాపరంగా వేడెక్కింది. ఈ సున్నితమైన అంశంపై ఏపీ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం సర్కార్‌కి కీలక లేఖ రాయడం ఇప్పుడు ఏపీవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దర్యాప్తులో తేలిన ప్రాథమిక అంశాలను క్రోడీకరిస్తూ సిట్ బృందం ప్రభుత్వానికి నివేదిక రూపంలో ఒక లేఖను సమర్పించింది. అందులో ప్రధానంగా ఈ కింది అంశాలను ప్రస్తావించినట్లు తెలుస్తోంది. వైఎస్ జగన్ హయాంలో టీటీడీ పరిపాలనలో, ముఖ్యంగా లడ్డూ ప్రసాదం తయారీకి వాడే నెయ్యి కొనుగోలు పక్రియలో అనేక ఉల్లంఘనలు జరిగినట్లు సిట్ గుర్తించింది. లడ్డూ తయారీలో వాడిన నెయ్యి నాణ్యత లోపించిందని, అందులో కల్తీ జరిగిన మాట వాస్తవమేనని సిట్ తన నివేదికలో స్పష్టం చేసినట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన నిబంధనలు, నాణ్యత పరీక్షల నిర్వహణపై కీలక సూచనలు చేసింది. సిట్ పంపిన సుదీర్ఘ లేఖను ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తోంది. పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాతే అధికారికంగా స్పందించాలని ముఖ్యమంత్రి కార్యాలయం భావిస్తోంది.



## శంకర్ నగర్ కాలనీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

- ఎస్ ఈ వెంకన్న చొరవతో విద్యుత్ సమస్యల పరిష్కారం
- విద్యుత్ అధికారులను శాలువాలతో సన్మానించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అప్పుల అంజిరెడ్డి

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శంకర్ నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు ప్రారంభించారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు విద్యుత్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. వచ్చే వేసవిలో లో-వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా కార్పొరేషన్ వ్యాప్తంగా అవసరమైన ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. శంకర్ నగర్ కాలనీలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి రావడంతో స్థానికులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే డివిజన్ పరిధిలోని కాలనీల్లో ఫీడర్లు, సర్క్యూట్ల ఏర్పాటు పనులు పూర్తి చేశామని, దీనివల్ల విద్యుత్ హెచ్చుతగ్గులు లేకుండా నిరంతర సరఫరా సాధ్యమవుతుందని వివరించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. వెంకన్న, డీఈ ఆపరేషన్స్ కీసర లింగయ్య, డీఈ టెక్నికల్ హబ్సిగూడ పి. వెంకన్న, డీఈ ఆపరేషన్స్ హబ్సిగూడ సత్యనారాయణ, డీఈ కన్స్ట్రక్షన్ హబ్సిగూడ భాగయ్య, ఏడీఈ ఆపరేషన్ ఘట్‌కేసర్ విజయకుమార్ రెడ్డి, చక్రవర్తి ఏడీఈ కమర్షియల్ చక్రవర్తి, ఏఈ ఆపరేషన్ పీర్జాదిగూడ సత్యనారాయణ రెడ్డి, లక్ష్మణరావు, ప్రసాద్, భాస్కర్, పప్పుల అంజిరెడ్డి, విద్యుత్ శాఖ సిబ్బంది కాలనీవాసులు పాల్గొన్నారు.



## రెడ్డి పేటలో పశు వైద్య శిబిరం

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** మండలంలోని రెడ్డి పేట గ్రామంలోని పశు వైద్యశాల ఆవరణలో పశుసంవర్ధక శాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించడం జరిగిందని మండల పశు వైద్యాధికారి డా. రాంచందర్ తెలిపారు. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ నాగులపల్లి రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని పాడి రైతులు ఈ ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని తమ పాడి అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈరోజు నిర్వహించిన పశు వైద్య శిబిరంలో 11 సాధారణ చికిత్సలు, 31 గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 4 కృత్రిమ గర్భధారణలు,15 దూడలకు నట్టల నివారణ చికిత్సలు నిర్వహించినట్టు మండల పశు వైద్యాధికారి రాంచందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వి ఎల్ వో శ్రీనివాసరావు, నారాయణ జెవిఓ, రమేష్ వి ఎ, ఆంజనేయులు, బాలమణి, గ్రామ పాడి రైతులు రవీందర్, రమేష్ , సుధాకర్, అశోక్, మొగ్గం రాజం పాల్గొన్నారు.



## ఎన్నికల బరిలో నీలం కవిత ఇస్నాపూర్‌లో నామినేషన్ దాఖలు

### స్వయంగా నామినేషన్ పత్రాలను అందించిన నీలం మధు ముదిరాజ్

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నీలం కవిత, మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్ సతీమణి శుక్రవారం అత్యంత ఘనంగా నామినేషన్ దాఖలు చేశారు. చిట్కుల్ గ్రామంలోని దుర్గామాత ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఆమె తన నామినేషన్ వేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ నాలుగో వార్డ్ కు చెందిన వందలాది మంది మహిళలు స్వచ్ఛందంగా నీలం నివాసానికి చేరుకొని కవితకు తమ మద్దతును ప్రకటించారు. నీలం కవితను గెలిపించుకోవడం మా బాధ్యత అంటూ నినదించిన మహిళలు. స్వయంగా నీలం మధు ముదిరాజ్ చేతుల మీదుగా నామినేషన్ పత్రాలను కవితకు అందజేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. మహిళ లోకమే ఆమెను దగ్గరుండి బరిలోకి దింపడం గమనార్హం. అనంతరం నీలం కవిత ఇస్నాపూర్ లోని కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు స్థానిక నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. మహిళల ఆశీర్వాదాలు కార్యకర్తల కష్టం తన గెలుపునకు పునాదులని ఈ సందర్భంగా కవిత ధీమా వ్యక్తం చేశారు.



## ఉపాధి హామీ పనులను పరిశీలించిన సర్పంచ్ దేవి సింగ్

**బీర్కూర్, రాజముద్ర న్యూస్ :** బీర్కూర్ మండలంలోని బీర్కూర్ తాండ గ్రామ సర్పంచ్ దేవి సింగ్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పల్లె ప్రకృతి వనంలో గల పిచ్చి మొక్కలు, చెట్లు ఎండిపోకుండా వాటర్ పెట్టాలని సెక్రటరీ సతీష్ ను ఆదేశించారు. ఉపాధి హామీ పనికి వచ్చే కూలీలు వారి యొక్క జాబ్ కార్డ్ నమోదు చేసుకొని పనికి రావచ్చు అన్నారు. అడిగిన వారందరికీ పని కల్పిస్తామన్నారు. ఉపాధి హామీ పనిని కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దిలీప్, సీనియర్ మేట్ గణేష్ పాల్గొన్నారు.

## 'సుస్థిర ఇంధన పరివర్తన- ప్రపంచ దృక్పథం'

# అంతర్జాతీయ సదస్సు

- ఐఐఆర్‌డీఈలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభ సమావేశంలో ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి. కె. మిశ్రా ప్రసంగం
- వికసిత భారత్ దార్శనికతలో పరిశుద్ధ ఇంధనం అంతర్భాగమని స్పష్టం చేసిన డాక్టర్ మిశ్రా







**న్యూఢిల్లీ, రాజముద్ర న్యూస్:** ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి. కె. మిశ్రా శుక్రవారం ఐఐఆర్‌డీఈలో 'సుస్థిర ఇంధన పరివర్తన- ప్రపంచ దృక్పథం' అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ప్రారంభ సమావేశంలో ప్రసంగించారు. వికసిత్ భారత్ దార్శనికతలో పరిశుద్ధ ఇంధనం అంతర్భాగంగా ఉందని డాక్టర్ మిశ్రా స్పష్టం చేశారు. ఇది ఇకమీదట కేవలం ఒక రంగానికి పరిమితమైనది కాదని... వృద్ధి, పోటీతత్వం, సామాజిక సమ్మిళితం, ఇంధన భద్రతకు కేంద్రమని ఆయన అన్నారు.

గత సంవత్సరం భారత ఇంధన వారోత్సవాల సందర్భంగా "పరిశుద్ధ ఇంధనం, హరిత వృద్ధి, సుస్థిర జీవనశైలిపైనే అభివృద్ధి చెందిన భారత్ నిర్మితమవుతుంది" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పిన మాటలు గుర్తు చేసుకుంటూ... 2014 నుంచి భారత ఇంధన పరివర్తన రెండు కీలక పాఠాలను మనకు అందిస్తోందని ఆయన తెలిపారు. మొదటిది... సంస్థాగత నిర్మాణం, స్థిరమైన ఆర్థిక నిబద్ధత, నిరంతర అమలు మద్దతు గల ప్రతిష్ఠాత్మక లక్ష్యాలు మాత్రమే విశ్వసనీయతను పొందుతాయి. పరిశుద్ధ ఇంధనాల కోసం స్థాపిత సామర్థ్యంలో 50 శాతాన్ని 2030 నాటికి సాధించాల్సి ఉండగా... దానిని 2025 నాటికే సాధించగలగడంలో భారత్ సామర్థ్యం, మునుపటి అంచనాల కంటే చాలా ముందుగానే 100 గిగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యాన్ని సాధించడం వంటివి మన విధానాల కొనసాగింపు, సంస్థాగత బలాల ప్రాముఖ్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. రెండోది... ఇంధన పరివర్తనలు స్పష్టమైన సంక్షేమ ఫలాలను అందించినప్పుడు అవి అత్యంత సుస్థిరమైనవి అవుతాయి. రైతులపై పీఎమ్ కుసుమ్ ప్రభావం, గృహాలకు పీఎమ్ సూర్య ఘర్ ద్వారా కలిగిన ఉపశమనం, సౌర విద్యుత్ తయారీ, విద్యుత్ వాహనాల ద్వారా లభించిన ఉద్యోగాలు... డీకార్బనైజేషన్-అభివృద్ధి ఒకదానికొకటి బలహీనపరుచుకోవడం కన్నా మరింత బలోపేతం చేసుకోగలవని నిరూపించాయని డాక్టర్ మిశ్రా వ్యాఖ్యానించారు.

గ్లోబల్ సౌత్ కోసం ఇంధన భద్రత, అందుబాటు ధరలు, అందరికీ అందుబాటులో ఉంచడం కీలకమని డాక్టర్ మిశ్రా అభిప్రాయపడ్డారు. ఈ పరివర్తన న్యాయబద్ధంగా, సమ్మిళితంగా, అభివృద్ధికి అనుగుణంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. విభిన్న బాధ్యతలు, జాతీయ పరిస్థితులు, సుస్థిర అంతర్జాతీయ సహకారం అవసరాన్నీ ఆయన ప్రస్తావించారు. భారత్ 2005-2020 మధ్య తన జీడీపీ ఉద్గారాల తీవ్రతను ఇప్పటికే సుమారు 36 శాతం తగ్గించిందనీ... 2030 నాటికి గల గడువు కంటే తొమ్మిది సంవత్సరాల ముందే పారిస్ ఒప్పంద లక్ష్యాలను నెరవేర్చిన మొదటి జీ20 దేశంగా అవతరించిందని డాక్టర్ మిశ్రా తెలిపారు. ఈ నేపథ్యంలోనే మనం భారత ఇంధన పరివర్తన వ్యూహాన్ని చూడాలని ఆయన వ్యాఖ్యానించారు. ఇంధన వనరుల వైవిధ్యం డీకార్బనైజేషన్‌తో పాటు ఇంధన భద్రతకూ దోహదపడిందని డాక్టర్ మిశ్రా స్పష్టం చేశారు. సౌర విద్యుత్ లక్ష్యాన్ని 20 గిగావాట్ల నుంచి 100 గిగావాట్లకు పెంచడం, జాతీయ సౌర మిషన్‌ను వేగవంతం చేయడం, 2016లో జాతీయ టారిఫ్ విధానానికి సవరణలు, 2018లో జీవ ఇంధనాల జాతీయ విధానం... 2021 స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో ప్రధానమంత్రి ప్రకటించిన జాతీయ హైడ్రోజన్ మిషన్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలు... ఆర్థిక వ్యవస్థను డీకార్బనైజ్ చేయడం, దీర్ఘకాలిక శిలాజ ఇంధన దిగుమతులను తగ్గించే ఒక మార్గంగా గ్రీన్ హైడ్రోజన్ దిశగా మార్పును గురించి సంకేతమిచ్చాయి. ఇటీవల రూపొందించిన చట్టాల ద్వారా అణు ఇంధన రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అనుమతినిస్తూ భారత్ చరిత్రాత్మక సంస్కరణను చేపట్టిందని డాక్టర్ మిశ్రా స్పష్టం చేశారు. ఇది 2047 నాటికి అణు ఇంధన సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందనీ... స్థిరమైన, సున్నా కార్బన్ బేస్‌లోడ్ ఇంధనాన్ని అందిస్తుందని భావిస్తున్నారు. ఇంధన భద్రత, దిగుమతుల తగ్గింపుతో ఇంధన పరివర్తనను నేరుగా ఈ చర్యలు సమలేఖనం చేస్తాయని... భారత వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని పెంచుతాయని డాక్టర్ మిశ్రా వివరించారు. పీఎమ్ కుసుమ్ విధాన సమ్మిళితత్వానికి ఉదాహరణగా నిలుస్తుందని డాక్టర్ మిశ్రా తెలిపారు: వాతావరణ మార్పులను తట్టుకోగల వ్యవసాయ పద్ధతులు, ఆర్థిక స్థిరత్వం, గ్రామీణాభివృద్ధిలు పరస్పరం బలోపేతం చేసుకునే విధంగా ఇంధన పరివర్తన వాటికి మద్దతునిస్తుంది. జీవ ఇంధనాల కార్యక్రమం ఈ గ్రామీణ పరివర్తనను మరింత బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు. పరిశుద్ధ ఇంధనాల ప్రయోజనాలు నేరుగా గృహాలకు విస్తరిస్తాయని, ఇంధన వ్యవస్థలో వినియోగదారులను క్రియాశీల భాగస్వాములుగా, ఉత్పత్తిదారులుగా మారుస్తాయని డాక్టర్ మిశ్రా అన్నారు. భారత్ ఇప్పటికే సంపూర్ణ గృహ విద్యుదీకరణను సాధించిందని, పరిశుద్ధ ఇంధన విస్తరణ సామాజిక సమగ్రతతో సమానంగా ఉండేలా చూసుకుందని ఆయన పేర్కొన్నారు. దీని ఆధారంగా 2024లో ప్రారంభించిన పీఎమ్ సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన... పరిశుద్ధ ఇంధనాన్ని నేరుగా గృహాల పైకప్పులపైకి తెచ్చింది. భవన నిర్మాణ నిబంధనలు, సామర్థ్య ప్రమాణాలతో కలిసి, ఉజాలా ఎల్ఈడీ ప్రోగ్రామ్ వంటి కార్యక్రమాలు భారత్ తక్కువ-కార్బన్ అభివృద్ధి వ్యూహంలో ఇంధన సామర్థ్యాన్ని మూలస్తంభంగా చేస్తాయి. పర్యావరణం కోసం జీవనశైలి (లైఫ్) ఉద్యమాన్ని ప్రారంభించడం ఒక కీలక పరిణామమని డాక్టర్ మిశ్రా స్పష్టం చేశారు. ఇది సుస్థిరత దృక్కోణంలో సాంకేతికతతో పాటు మార్పు ప్రాముఖ్యాన్ని గుర్తించిందన్నారు. ఈ చర్యల ద్వారా భారత్ తన పారిస్ ఒప్పంద లక్ష్యాలను నిర్దేశిత సమయానికి చాలా ముందుగానే సాధించిన మొదటి జీ20 దేశంగా అవతరించిందని పేర్కొన్నారు. ప్రకటించిన గడువు కంటే ముందే 50 శాతం శిలాజేతర స్థాపిత విద్యుత్ ఉత్పాదక సామర్థ్యాన్నీ భారత్ అధిగమించిందని ఆయన తెలిపారు. సోలార్ పీవీ మాడ్యూల్స్ కోసం ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకం (పీఎల్ఐ) పథకం గురించి డాక్టర్ మిశ్రా మాట్లాడుతూ, దేశీయ తయారీ దిశగా నిర్ణయాత్మక మార్పులో దాని ప్రాముఖ్యాన్ని స్పష్టం చేశారు. 2022 నుంచి, సోలార్ మాడ్యూల్ తయారీ సామర్థ్యం దాదాపు 120 గిగావాట్లకు విస్తరించి దాదాపు 82 గిగావాట్ల పెరుగుదలను నమోదు చేసిందన్నారు. అధునాతన బ్యాటరీ తయారీ, ఇతర పరిశుద్ధ ఇంధన సప్లయి చెయిన్‌లకు మద్దతు ద్వారానే ఇది సాధ్యమైందని డాక్టర్ మిశ్రా పేర్కొన్నారు.

## తెల్లాపూర్ మేళ్లచెరువుకి వచ్చిన హైడ్రా

### కబ్జాకి గురైన మేళ్లచెరువుని పూర్తిస్థాయిలో హైడ్రా కాపాడుతుందా?

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్ :** రామచంద్రపురం మండల పరిధిలోని తెల్లాపూర్ మేళ్లచెరువు సికం ఎఫ్టిఎల్ బఫర్ జోన్లలో గతంలో నుండి అనేక నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. చెరువులోకి వచ్చే కాలువలు సైతం ఇక్కడి బడా రియల్ వ్యాపారులు భూములు కొనుగోలు చేసుకుని, వ్యవసాయం పేరు మీద వేల లారీల మట్టిని పోసి పూడ్చడం జరుగుతుంది. ఇరిగేషన్ అధికారులు వచ్చి అనేక సార్లు చెప్పినప్పటికీ ఫలితం లేకుండా పోతుంది. ఇదే విషయాలను ఆ శాఖ ద్వారా హైడ్రాకు తెలపడం, కొందరు ప్రత్యక్షంగా హైడ్రా కమిషనర్ కు ఫిర్యాదు కూడా చేయడం జరిగింది. ఇదే విషయాన్ని సైతం పటాన్చెరువు నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ ఇన్చార్జి సుంకు వినయ్ కుమార్ పలుసార్లు హైడ్రా కమిషనర్ కు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేయడం జరిగింది. మార్చ్ 6, 2024 నాడు ఇరిగేషన్ డిపార్ట్మెంట్,మండల రెవెన్యూ సిబ్బంది వచ్చి మేళ్లచెరువుకి కేవలం ఒక వైపు ట్రెన్స్ కొట్టి వెళ్లిపోయారు. హైడ్రా కూడా ఇలాగే పనిచేస్తుందా? తెల్లాపూర్ లోని మేళ్లచెరువుని మట్టి వేసి కబ్జా చేస్తున్నారన్న విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి బి ఎస్ పి పటాన్చెరు అసెంబ్లీ ప్రెసిడెంట్ శ్రీశైలం బీఎస్పీ పటాన్చెరు అసెంబ్లీ ఇన్చార్జ్ సుంకు వినయ్ కుమార్ 28 ఆగస్టు 2024 నాడు, 27 జనవరి 2025 నాడు ప్రజావాణిలో తీసుకు వెళ్లడం జరిగింది. అందుకు స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ తప్పకుండా మేళ్లచెరువుని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. ఈనెల 27 నాడు రంగనాథ్ రామచంద్రపురం లోని రాయసముద్రం చెరువుని సందర్శించారు.అప్పుడు వినయ్ కుమార్ రంగనాథ్ కి మేళ్లచెరువు మళ్లీ కబ్జాకు గురవుతుందని చెరువులో మట్టి నింపే పని జోరుగా జరుగుతుందని చెప్పారు. రంగనాథ్ వెంటనే అక్కడున్న హైడ్రా ఇన్స్పెక్టర్ బాలగోపాల్ ని వెళ్లి



మేళ్లచెరువుని సందర్శించి రిపోర్టు ఇవ్వమని చెప్పారు. ఈరోజు ఉదయం హైడ్రా మేళ్లచెరువు వద్దకు వచ్చి ఎవరైతే మేళ్లచెరువుని కబ్జా చేస్తున్నారో, ఎఫ్టీఎల్ చుట్టూ మొత్తం ఫెన్సింగ్ వేశారు.. ఆ ఫెన్సింగ్ ని పూర్తిగా తొలగించి ఎఫ్ టి ఎల్ లెవెల్ ను ఫిక్స్ చేసి ఫెన్సింగ్ వేస్తామని అక్కడ పనిచేస్తున్న హైడ్రా సిబ్బంది వినయ్ కుమార్ కు చెప్పారు.. గతంలో రామచంద్రపురం ఇరిగేషన్ ఆఫీసర్ కి, రామచంద్రపురం మండల్ రెవెన్యూ ఆఫీసర్ సంగ్రామ్ రెడ్డి కి అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ కి 5 మార్చ్ 2024 నాడు ఫోన్ల ద్వారా మేళ్లచెరువు కబ్జాకి గురవుతుందని చెరువులో టిప్పర్ల సహాయంతో మట్టి నింపుతున్నారని వినయ్ కుమార్ చెప్పారు. మార్చి 6 2024 నాడు ఇరిగేషన్ సిబ్బంది మండల రెవెన్యూ సిబ్బంది మేళ్లచెరువు వద్దకు వచ్చి కేవలం తూతూ మంత్రం వేసినట్టు ఒక వైపు జెసిబిలు కానీ పెద్ద వాహనాలు కానీ వెళ్లకుండా రాకుండా ట్రెంచ్ కొట్టించారు. మరి ఈరోజు మేళ్లచెరువు కి వచ్చిన హైడ్రా కూడా అదేవిధంగా పనిచేస్తుందా లేదా చెరువు చుట్టూ వేసిన ఫెన్సింగ్ ను పూర్తిగా తొలగించి చెరువు ఎఫ్ టి ఎల్ లో వేసిన మట్టిని కూడా పూర్తిస్థాయిలో తొలగిస్తదా లేదా అనేది ప్రజలు అనుకుంటున్నారు.



## కస్తూర్బా పాఠశాలను ఆకస్మిక తనిఖీ

**రామారెడ్డి రాజా ముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం కస్తూర్బా పాఠశాలను మధ్యాహ్నం భోజనం పరిశీలించిన సర్పంచ్ బండి ప్రవీణ్, ఉప సర్పంచ్ నవీన్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఆదేశించారు, పాఠశాల ఆవరణలో అభివృద్ధి కి అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ వైస్ చైర్మన్ పశుపతి, వార్డ్ మెంబెర్స్ బిట్ల రవి, పిప్పిరి లింబాద్రి, కందుల స్వామి పాల్గొన్నారు.

## విద్యతో పాటు క్రీడలే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది

### బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సెయింట్ జోసెఫ్స్ హై స్కూల్‌లో నిర్వహించిన వార్షిక క్రీడా దినోత్సవం వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ తో కలిసి బీఆర్ఎస్ నాయకులు, వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ, క్రీడలు కేవలం పోటీలు మాత్రమే కాకుండా జీవితం నేర్పే గొప్ప పాఠశాలలాంటివని అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, సహనం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని చెప్పారు. ఆరోగ్యంగా ఉన్న శరీరంలోనే బలమైన ఆలోచనలు పుడతాయని, అందుకే చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గెలుపు ఒక్కరోజు ఆనందాన్ని ఇస్తే, ఓటమి జీవితాంతం ఉపయోగపడే అనుభవాన్ని నేర్పుతుందని ఆయన అన్నారు. ప్రతి పోటీ విద్యార్థులను మరింత బలంగా, ధైర్యంగా తీర్చిదిద్దుతుందని తెలిపారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనడం ద్వారానే నిజమైన విజయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ రోజు మైదానంలో అడుగు పెట్టిన ప్రతి విద్యార్థి, విద్యార్థినీ ఇప్పటికే విజేతలేనని ప్రశంసించారు.విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి, స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి సాధన చేస్తే అసాధ్యం అనే మాటే ఉండదని అన్నారు. క్రీడలు నాయకత్వ గుణాలు, టీమ్ వర్క్, పరస్పర గౌరవాన్ని అలవర్చడంతో పాటు, భవిష్యత్తులో మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. చదువులోనూ, ఆటలోనూ సమతుల్యత సాధించినప్పుడే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థుల ఎదుగుదలకు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో కీలకమని, ఈ మూడు కలిసి పనిచేసినప్పుడే పిల్లలు రాష్ట్ర, జాతీయ స్థాయిలకే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటగలరని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్ఈఓ నాగేశ్వర రావు , పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోసం బాబు , సెల్వన్ ఫాదర్ , ఎండీఆ ర్ ఫౌండేషన్ అధ్యక్షులు మధు, ప్రవీణ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఎమ్ పి ఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## చేగోమ్మ సర్వముఖాభివృద్ధికి కృషి చేస్తా

### సర్పంచ్ బత్తుల వీరస్వామి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** గ్రామాభివృద్ధే లక్ష్యంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగుతాయని సర్పంచ్ బత్తుల వీరస్వామి అన్నారు.కూసుమంచి మండలంలోని చేగోమ్మ గ్రామంలో సైడ్ డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగును,వీధుల్లో నిలువ ఉన్న చెత్తా చెదారంను పారిశుధ్య కార్మికుల చేత శుభ్రం చేయించారు.అదే విధంగా విద్యుత్ స్తంభాలకు నూతన వీధి దీపాలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో చేగోమ్మ గ్రామ సర్వముఖాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.అత్యవసర పరిస్థితుల్లో గ్రామ ప్రజల తనను నిర్మొహమాటంగా కలువ వచ్చని తెలిపారు. అనంతరం అఖిల కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ శిబిరంలో 200 మంది గ్రామస్తులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి,రాయితీ పై కళ్లజోళ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గాడిచర్ల సురేష్,పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.




## పంచాయితీ కార్యాలయంకు టేబుళ్లు వితరణ : సర్పంచ్ బానోత్ పుష్ప

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** గ్రామాభివృద్ధికి సహకరిస్తామని ముందుకు వచ్చిన యువకులను సర్పంచ్ బానోత్ పుష్ప అభినందించారు.కూసుమంచి మండలంలోని లింగరాంతండా గ్రామానికి చెందిన యువకులు వడిత్యా వెంకన్న,వడిత్యా వినోద్ నూతన గ్రామ పంచాయితీ కార్యాలయంకు రెండు టేబుళ్లను శుక్రవారం గ్రామ పెద్దల సమక్షంలో వితరణగా అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకవర్గం సమన్వయంతో,రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా, ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి అశోక్,వార్డు సభ్యులు నాగేశ్వరావు,గ్రామ పెద్దలు బానోత్ రవి, బాసు, మత్రు, వీరన్న, శేషగిరి, పంచాయతీ సిబంది వీరన్న, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడుతాయి

### :ఏఎంసి చైర్మన్ వెన్నుపూసల సీతారాములు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** క్రీడలు మానసిక ఉల్లాసానికి,శారీరక ధృడత్వానికి దోహదపడతాయని నేలకొండపల్లి మార్కెట్ కమిట్ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు అన్నారు.మండలంలోని బోదులబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలను శుక్రవారం తహశీల్దార్ వెంకటేశ్వర్లుతో కలసి ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల వల్ల స్నేహభావం,నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని తెలిపారు.క్రీడల్లో గెలుపు,ఓటములు సహజమని ఓటమి రేపటి విజయానికి నాంది అని తెలియజేశారు.ప్రతి ఒక్కరూ గెలవాలనే తలంపుతో క్రీడల్లో పాల్గొనాలన్నారు.ఎస్సై సంతోష్ మాట్లాడుతూ నేటి యువత గంజాయి, నార్కోటిక్ డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు,జూదానికి దూరంగా ఉంటూ సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.మండల విద్యాధికారి చలపతిరావు మాట్లాడుతూ క్రీడల్లో గెలిచి, మండల,జిల్లా స్థాయిలో రాణించాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్టెకోల నాగార్జునరావు,నాయకులు నెల్లూరు భద్రయ్య,ఆయా గ్రామాల సర్పంచులు,పిఎంఆర్ ట్రస్ట్ బాధ్యులు, పిడిలు,ఉపాధ్యాయులు,కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు.



## యాప్ ద్వారా మాత్రమే యూరియా విక్రయాలు : ఏఓ రామడుగు వాణి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** యూరియా బుకింగ్ యాప్ ద్వారా మాత్రమే యూరియా అమ్మకాలు జరుగుతాయని,రైతులు ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ గూగుల్ ప్లే స్టోర్ లో ఆప్ ను డౌన్లోడ్ చేసుకొని,అందుబాటులో ఉన్న దుకాణాల ద్వారా బుక్ చేసుకుని యూరియా కొనుగోలు చేసుకోవాలని కూసుమంచి మండల వ్యవసాయాధికారిణి రామడుగు వాణి సూచించారు.మండలంలోని చేగోమ్మ సొసైటీలో ఫెర్టిలైజర్స్ బుకింగ్ యాప్ ద్వారా జరుగుతున్న యూరియా సరఫరాను శుక్రవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా అక్కడున్న రైతులతో యాప్ పని విధానాన్ని గురించి చర్చించగా వారు యాప్ వాడకం సౌకర్యవంతంగా ఉందని క్యూలో వేచి ఉండే సమస్య కూడా లేదని ఇంటి వద్ద నుండి బుక్ చేసుకోవడం చాలా సంతోషకరంగా ఉందని తెలియజేశారు.తదుపరి పోచారం గ్రామంలోని కాండం కుళ్లు సోకిన వరి పంటను పరిశీలించి రైతులకు నివారణ చర్యల గురించి తగు సూచనలు చేశారు.అనంతరం పోచారం,పెరికసింగారం గ్రామంలోని రైతులకు యూరియా బుకింగ్ యాప్ పై అవగాహన కల్పించి ఏ విధంగా బుక్ చేసుకోవాలో తెలియజేశారు.ఆ తర్వాత కూసుమంచిలోని రైతు వేదికలో జాతీయ ఆహార భద్రత పథకం కింద రాయితీలో ఇచ్చిన కంది పంటకు సంబంధించి వేప నూనె మరియు పురుగుమందులను వంద శాతం రాయితీతో రైతులకు అందించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రవికుమార్,సాయిరాం,నవీన్,జానీ బాబా,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## కువైట్-ఢిల్లీ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

### అత్యవసర ల్యాండింగ్




**న్యూఢిల్లీ :** కువైట్ నుంచి ఢిల్లీ బయల్దేరిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడం కలకలం సృష్టించింది. దీంతో విమానాన్ని అహ్మదాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కువైట్ నుంచి ఢిల్లీ బయల్దేరిన ఇండిగో విమానం గాల్లో ఉన్న సమయంలో టాయిలెట్‌లోని ఓ టిష్యూ పేపర్‌పై విమానంలో బాంబు పెట్టినట్లు రాసి ఉన్న బెదిరింపు నోట్‌ని ఓ ప్రయాణికుడు గుర్తించి, సిబ్బందిని అప్రమత్తం చేశాడు. వెంటనే స్పందించిన పైలట్లు అహ్మదాబాద్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కి సమాచారం అందించి అత్యవసర ల్యాండింగ్ కోసం అభ్యర్థించారు. దీంతో విమానాశ్రయ అధికారులు ఫైర్ టెండర్లు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. శుక్రవారం ఉదయం 6.40గంటలకు అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. అనంతరం ప్రయాణికులను కిందకు దించేసి, విమానంలో తనిఖీలు చేశారు. ఇప్పటి వరకు ఎటువంటి అనుమానాస్పద వస్తువులు కనిపించలేదని.. అధికారుల తుది అనుమతి పొందిన తర్వాత విమానం తిరిగి ఢిల్లీకి బయల్దేరే అవకాశం ఉందని విమానాశ్రయ అధికారి తెలిపారు. ఘటన సమయంలో విమానంలో 180 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది.

## పర్యాటకురాలికి చేదు అనుభవం..

### 400 మీటర్లకు రూ.18వేలు వసూల్



**ముంబయి :** భారత పర్యటనకు వచ్చిన ఓ అమెరికన్ పర్యాటకురాలి కి చేదు అనుభవం ఎదురైంది. ముంబయి నగరంలో కేవలం 400 మీటర్ల ప్రయాణానికి ఓ ట్యాక్సీ డ్రైవర్ ఏకంగా ఆమె నుంచి రూ.18వేలు వసూలు చేశాడు. ఈ మేరకు పర్యాటకురాలు చేసిన పోస్టు వైరల్ అవడంతో.. పోలీసులు స్పందించి ఆ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొన్నారు. అర్జెంటీనా అరియానో అనే ఎక్స్ ఖాతా కలిగిన ఒకరు పోస్టు పెట్టారు. దాని ప్రకారం.. 'ఇటీవల ముంబయిలో దిగి స్టార్ హోటల్‌కు వెళ్లేందుకు ఓ ట్యాక్సీని మాట్లాడుకున్నాం. డ్రైవర్, మరో వ్యక్తి తొలుత మమ్మల్ని తెలియని ప్రదేశానికి తీసుకెళ్లారు. మా నుంచి రూ.18,000 వసూలు చేసి.. ఆ తర్వాత 400 మీటర్ల దూరంలోని ఓ హోటల్ వద్ద దింపారు' అని రాసుకొచ్చారు. ఈ క్రమంలోనే ఆ ట్యాక్సీకి సంబంధించిన వివరాలు కూడా యూజర్ వెల్లడించారు. ఈ పోస్టు కాస్తా వైరల్ అవడంతో పోలీసుల కంటపడింది. దీన్ని సుమోటోగా తీసుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేసి మూడు గంటల్లో ట్యాక్సీ డ్రైవర్ దేశరాజ్ యాదవ్‌ను అదుపులోకి తీసుకొన్నారు. ఆ పర్యాటకురాలిని సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదని అధికారులు తెలిపారు. దేశరాజ్‌ను విచారించగా.. ఆ మహిళను అంధేరీ ఈస్ట్ చుట్టూ 20 నిమిషాలు తిప్పి ఆ తర్వాత అదే ప్రాంతానికి తిరిగి తీసుకొచ్చి పక్కనే ఉన్న హోటల్ వద్ద దింపినట్లు అతడు అంగీకరించాడని అధికారులు తెలిపారు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## సోషల్ మీడియాలో ప్రభుత్వ ఉద్యోగులు

### ఖాతా తెరవాలంటే అనుమతి తీసుకోవాల్సిందే : బిహార్ ప్రభుత్వం




**బిహార్ :** ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియా వినియోగానికి సంబంధించి బిహార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాతోపాటు యూట్యూబ్ వంటి ఆన్‌లైన్ వేదికల్లో ప్రవర్తనపై మార్గదర్శకాలను రూపొందించింది. ఉన్నతస్థాయి నుంచి కింది స్థాయి వరకు ఉద్యోగులందరికీ ఇవి వర్తిస్తాయని స్పష్టం చేసింది. దీనికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపగా.. ఉద్యోగుల సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విధించే ఉద్దేశం లేదని, డిజిటల్ వేదికల్లో హుందాగా వ్యవహరించేలా చూడడమే తమ ఉద్దేశమని బిహార్ ప్రభుత్వం పేర్కొంది.

- తాజా మార్గదర్శకాల ప్రకారం.. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి సోషల్ మీడియా ఖాతా తెరవాలంటే సంబంధిత శాఖ ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సిందే. నకిలీ ఖాతాలు ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించే ప్రసక్తే లేదు.
- అధికారిక హోదా, ప్రభుత్వ లోగో లేదా హోదాకు సంబంధించి ఎటువంటి పోస్టులూ ఆన్‌లైన్‌లో పెట్టకూడదు.
- వ్యక్తిగత సోషల్ మీడియా ఖాతాలకు ప్రభుత్వ ఈ-మెయిల్ ఐడీలు లేదా ప్రభుత్వ ఫోన్ నంబర్లను వాడొద్దు. ఉద్యోగుల వ్యక్తిగత అభిప్రాయాలకు ప్రభుత్వ హోదాతో సంబంధం లేదని స్పష్టంగా చెప్పడమే దీని ఉద్దేశం.
- అశ్లీలంతో పాటు సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే కంటెంట్.. కుల, మతాలను లక్ష్యంగా చేసుకొని చేసే పోస్టులపై నిషేధం.
- అధికారిక కార్యక్రమాలు, సమావేశాల వీడియోలు, ఫొటోలు కూడా ఆన్‌లైన్‌లో షేర్ చేయొద్దు.
- ఎటువంటి కంటెంట్ పోస్టు లేదా షేర్ చేయవచ్చనే దానిపై నిబంధనలను స్పష్టంగా పేర్కొన్నట్లు బిహార్ ప్రభుత్వం చెప్పింది.

## నెలసరి పరిశుభ్రత కూడా ప్రాథమిక హక్కే : సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** మహిళల ఆరోగ్యం విషయంలో సుప్రీంకోర్టు శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. నెలసరి పరిశుభ్రత కూడా ప్రాథమిక హక్కేనని స్పష్టంచేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు, గోప్యతా హక్కులో ఇది అంతర్భాగమని తీర్పులో పేర్కొంది. ఈ క్రమంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, పాఠశాలలకు పలు ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల్లో విద్యార్థినులకు ఉచిత శానిటరీ ప్యాడ్స్ అందించాలని, కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషను విచారించిన సుప్రీంకోర్టు.. తాజా గా తీర్పు వెలువరించింది. అన్ని పాఠశాలల్లో విద్యార్థినులకు పర్యావరణహితమైన శానిటరీ ప్యాడ్స్‌ను ఉచితంగా అందిం చాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. "ఈ తీర్పు న్యాయవ్యవస్థలో భాగమైన వారికోసం మాత్రమే కాదు. సహాయం అడిగేందుకు సంకోచించే విద్యార్థినులు, నిధుల కొరత కారణంగా సహాయం చేయలేని స్థితిలో ఉన్న ఉపాధ్యా యుల కోసం కూడా. నిస్సహాయ స్థితిలో ఉన్నవారిని మనం ఎలా రక్షిస్తున్నామనే దానిని పురోగతిగా పరిగణిస్తారు" అని సుప్రీం ధర్మాసనం తీర్పులో భాగంగా వ్యాఖ్యానించింది. విద్యార్థులు, విద్యార్థినులకు వేర్వేరుగా టాయిలెట్స్ ఉండేలా చూడాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దివ్యాంగుల అవసరాల కు తగినట్లుగా ప్రత్యేక టాయిలెట్లు ఉండాలని పేర్కొంది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు ఈ ఆదేశాలను పాటించాలని స్పష్టం చేసింది. బాలబాలికలకు వేర్వేరుగా టాయిలెట్ల ఏర్పాటు లేకపోతే.. ప్రైవేటు పాఠశాలలు గుర్తింపు కోల్పోవాల్సి ఉంటుందని ఈ సందర్భంగా హెచ్చరించింది. బాలికలు, మహిళల నెలసరి పరిశుభ్రతను పొందే హక్కును ఒక దాతృత్వంగా చూడొద్దని ధర్మాసనం పేర్కొంది. బాలికలకు ఉచిత శానిటరీ ప్యాడ్స్, టాయిలెట్ల సౌకర్యాన్ని కల్పించడంలో విఫలమైతే.. ప్రభుత్వాన్ని జవాబుదారీగా చేస్తామని హెచ్చరికలు చేసింది. ఈ సౌకర్యాల లేమి, నెలసరి విషయంలో ఉన్న అపోహలు బాలికల ఆరోగ్యం, విద్య, గోప్యతను ప్రభావితం చేస్తున్నాయని పేర్కొంది.



## అట్టహాసంగా సిపిఐ అభ్యర్థుల నామినేషన్

### పాల్గొన్న భాగం హేమంతరావు, దండి సురేష్

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ఎదులాపురం మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా 28, 29, 30, 31,32 ,24 ,19, 16, 3 వార్డులకు సిపిఐ అభ్యర్థులు శుక్రవారం అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. తొలుత ఎర్రజెండాల రెపరెపల నడుమ ద్విచక్ర వాహన ర్యాలీగా నామినేషన్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అభ్యర్థుల నామినేషన్లలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, మెడకంటి చిన్న వెంకటరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, నాయకుడు చిన్న సైదిరెడ్డి పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపాలిటీ నాయకులు, యువజన సంఘం సభ్యులు, మహిళా సమైక్య సభ్యులు తదితరు లు పాల్గొన్నారు.



## మీరు హామీ ఇవ్వండి.. నెరవేర్చే బాధ్యత నాది!

### ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల సమావేశంలో మంత్రి పొంగులేటి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ఖమ్మం వార్డుల్లోకి వెళ్ళండి.జనం సమస్యలను గుండెలకు హత్తుకోండి.. పరిష్కరిస్తామని గట్టిగా హామీ ఇవ్వండి.. వాటిని నెరవేర్చే బాధ్యత తనది" అంటూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఏదులాపురం అభ్యర్థులకు స్పష్టం చేశారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో 32 వార్డుల అభ్యర్థులు, ఇన్-చార్జులతో శుక్రవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా సమావేశం నిర్వహించిన మంత్రి మాట్లాడుతూ,మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటే, ఏదులాపురం రూపురేఖలను మారుస్తానని మంత్రి చెప్పారు. అభివృద్ధిలో ఏదులాపురాన్ని రాష్ట్రానికే ఒక దిక్సూచిగా, ఆదర్శ మున్సిపాలిటీగా నిలబెట్టే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఏదులాపురాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రచారంలో భాగంగా ప్రతి వార్డులోనూ తాను స్వయంగా పర్యటించి ప్రచారం నిర్వహిస్తానని వెల్లడించారు. ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేస్తూ, దూకుడుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వార్డు, జోనల్ ఇన్-చార్జులు, అభ్యర్థులు సమన్వయంతో ప్రతి ఓటరును కలిసి కాంగ్రెస్ వైపు తిప్పుకోవాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూనే, అభివృద్ధి పట్ల వారికున్న నిబద్ధతను చాటిచెప్పాలన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకోవడమే ఏకైక లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని మంత్రి పొంగులేటి దిశానిర్దేశం చేశారు.




## కుష్టు వ్యాధి రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- కుష్టు వ్యాధి మందులతో పూర్తిగా నయమవుతుంది
- కుష్టు వ్యాధిగ్రస్థులపై వివక్ష చూపొద్దు

**ఖమ్మం,రాజముద్ర న్యూస్ :** కుష్టు వ్యాధి రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రతిఒక్కరు తమవంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చేపట్టిన జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా మహాత్మా గాంధీ వర్థంతిని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్, మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జాతిపిత మహాత్మాగాంధీ మార్గదర్శనంలో నడవడమే ఆయానకిచ్చే ఘన నివాళి అన్నారు. మహాత్మా గాంధీ ని ఒక జర్నలిస్ట్ మీ జీవితం ద్వారా ఏం చెప్పదల్చుకున్నారు అని అడుగగా, నా జీవితమే ఒక సందేశమని మహాత్మా గాంధీ అన్నారని తెలిపారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, వివక్షకు గురై ఎన్నో అవమానాలకు మహాత్మా గాంధీ గురయ్యారని అన్నారు. ఒక తెల్ల జాతీయుడు, మహాత్మా గాంధీ ని జాతి వివక్ష తో రైలు నుండి గెంటివేసినప్పుడు, సత్యానికి, న్యాయానికి మహాత్మా గాంధీ పోరాడారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, దండి సత్యాగ్రహం లాంటి ఎన్నో ఉద్యమాలతో హింసకు తావులేకుండా, అహింసా మార్గంలో స్వాతంత్ర్యాన్ని సాధించారన్నారు. కుష్టు రోగులకు సమాజంలో వివక్ష, ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి, వారికి ఆరోగ్యం, సమాజంలో వివక్ష తొలగించే విధంగా సబర్మతి ఆశ్రమంలో మహాత్మా గాంధీ సేవాలందించారన్నారు.కుష్టు వ్యాధి ఎవరి తప్పు కాదని, బాధితులను వివక్షకు గురిచేయవద్దని కలెక్టర్ అన్నారు. మందులతో పూర్తిగా నయమయ్యే జబ్బని, కుష్టు రోగులకు సహాయంగా నిలవాలని అన్నారు. కుష్టు వ్యాధికి పూర్తి ఉచితంగా చికిత్స అందిస్తున్నామని, 12 నెలలు మందులు వాడితే పూర్తిగా నయమవుతుందని తెలిపారు. కుష్టు వ్యాధి లక్షణాలు, మచ్చలు ఏర్పడినప్పుడే, వెంటనే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలన్నారు. జిల్లాలో గుర్తించిన 74 మంది కుష్టువ్యాధిగ్రస్థుల ఉచిత చికిత్స అందిస్తున్నామన్నారు. అనుమానిత ప్రతిఒక్కరికి పరీక్షలు చేయాలన్నారు. స్పర్శ కుష్టు వ్యాధి ప్రచార కార్యక్రమాన్ని 30 జనవరి నుండి 13 ఫిబ్రవరి వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ అన్నారు.కుష్టు రహిత సమాజ నిర్మాణం, వ్యాప్తిని అడ్డుకోవడం, వ్యాధిగ్రస్తులపై ఉన్న కళంకాన్ని తొలగించి, వారికి గౌరవప్రదమైన జీవనాన్ని అందించడమే లక్ష్యంగా వెళ్ళాలన్నారు. కుష్టు వ్యాధిపట్ల ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో కుష్టు వ్యాధి నిర్మూలనకై అధికారులు, సిబ్బందిచే వాగ్దానం చేయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, అదనపు వైద్య ఆరోగ్య అధికారి డా. చందు నాయక్, ఉప జిల్లా వైద్య అధికారి డా. వేణు మనోహర్, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, వైద్యాధికారులు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లో ఇంటర్నెట్ వినియోగదారులు 95 కోట్లు

దేశంలో ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 2025 నాటికి 95 కోట్లు దాటింది. 2024తో (88.6 కోట్లు) పోలిస్తే ఎనిమిది శాతం పెరిగింది. అంతర్జాలాన్ని వినియోగించే వారిలో 57 శాతం మంది గ్రామీణ ప్రాంతాలకు చెందినవారే ఉన్నారు. 'ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా', కాంటార్‌లు కలిసి రూపొందించిన 'ఇంటర్నెట్ ఇన్ ఇండియా రిపోర్ట్ 2025'లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో కనెక్టివిటీ వేగంగా మెరుగుపడటం, షార్ట్ వీడియోలకు ఆదరణ, ఏఐ వినియోగం పెరుగుదల వంటివి దీనికి ప్రధాన కారణాలుగా నివేదిక పేర్కొంది.








## నష్టాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలు నష్టాల్లో ముగిశాయి. బడ్జెట్ ముందు మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. ముఖ్యంగా ఐటీ, మెటల్ స్టాక్స్‌లో విక్రయాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. దీనికితోడు రూపాయి విలువ పతనం, ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. సెన్సెక్స్ ఉదయం 81,947.31 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,566.37) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాలు కొనసాగాయి. చివరికి 296.59 పాయింట్ల నష్టంతో 82,269.78 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98.25 పాయింట్ల నష్టంతో 25,320.65 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.02గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రధానంగా నష్టపోయాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, ఎస్‌బీఐ, ఐటీసీ, బీఈఎల్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 5060 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## అది బంగ్లాదేశ్ స్వయంకృతాపరాధం

### టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సురేశ్ రైనా



టీ20 వరల్డ్ కప్ 2026 ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక వేదికగా ప్రారంభం కానుంది. అయితే భద్రత కారణాలను సాకుగా చూపుతూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ తమ క్రీడాకారులను భారత్‌కు పంపడానికి ఒప్పుకోలేదు. తమ మ్యాచ్ వేదికలను శ్రీలంకకు మార్చమని ఐసీసీపై ఒత్తిడి తెచ్చిన విషయం తెలిసిందే. అయితే బంగ్లాదేశ్ చెప్పినట్లు భారత్‌లో భద్రత సమస్యలు లేనందున ఐసీసీ దీనికి అంగీకరించలేదు. దీంతో బంగ్లాదేశ్ మెగా టోర్నీ నుంచి తప్పుకొంది. ర్యాంకుల ఆధారంగా బంగ్లా స్థానంలో స్కాట్లాండ్‌ను ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ కోసం ఎంపిక చేసింది. బంగ్లాకు మద్దతుగా పాకిస్థాన్ కూడా వరల్డ్‌కప్‌ను బహిష్కరిస్తుందని వార్తలు వచ్చాయి. కానీ తర్వాత పాక్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. టీ20 ప్రపంచకప్ కోసం ఆ జట్టు శ్రీలంకకు వెళ్లబోతోంది. ఈ మేరకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు షెడ్యూల్ కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. ఫిబ్రవరి 2న పాక్ కొలంబోకు చేరనున్నట్లు తెలిసింది. ఈ మేరకు పీసీబీ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ పరిణామాలపై టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సురేశ్ రైనా వరల్డ్ లెజెండ్స్ ప్రో టీ20 లీగ్ సందర్భంగా మాట్లాడాడు. 'ప్రస్తుతం ఏదైతే జరిగిందో అదంతా బంగ్లాదేశ్ స్వయంకృతాపరాధం. భారత్‌లో భద్రతపరమైన సమస్యలు లేవు. నా ఉద్దేశంలో ఇదంతా బంగ్లాదేశ్ తప్పు. ఆ దేశ క్రికెట్ జట్టు భారత్‌కు రాకపోవడం వల్ల చాలా కోల్పోనుంది. నిజానికి ఆ టీమ్ చాలా స్ట్రాంగ్‌గా కనిపిస్తోంది. ఆ జట్టు స్పిన్నర్లకు భారత్ పిచ్‌ల గురించి బాగా తెలుసు' అని సురేశ్ రైనా అన్నాడు. అలాగే టీ20 వరల్డ్ కప్ 2026 నేపథ్యంలో ఐసీసీ ఛైర్మన్ జైషా వ్యాఖ్యల గురించి కూడా సురేశ్ రైనా మాట్లాడాడు. 'టీ20 వరల్డ్ కప్ ఆడేందుకు ఎవరైతే భారత్‌కు రారో.. వారి మీద కఠినమైన చర్యలు తీసుకుంటామని ఐసీసీ ఛైర్మన్ అన్నారు. అలాగే ఆ దేశ క్రికెట్ బోర్డులు సైతం భారీగా నష్టపోయే అవకాశమూ ఉంది' అని సురేశ్ రైనా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

## ఇండియా- పాకిస్థాన్ మ్యాచ్‌కి సెక్యూరిటీ పెంచిన శ్రీలంక

ప్రస్తుతం న్యూజిలాండ్‌తో ఇండియా, ఆస్ట్రేలియాతో పాకిస్థాన్ టీ20 సిరీస్‌లు ఆడుతున్నాయి. కానీ వరల్డ్ క్రికెట్ ఫ్యాన్స్ మాత్రం టీ20 ప్రపంచ కప్ 2026 కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా శ్రీలంకలో ఫిబ్రవరి 15న జరగనున్న ఇండియా జం పాకిస్థాన్ మ్యాచ్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే ఆసియా కప్ సమయంలో ఇక పాకిస్థాన్, ఇండియాకి పోటీయే కాదని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. చాలా మంది అభిప్రాయం కూడా ఇదే. అయితే రాజకీయ ఉద్రిక్తతలు, ఇటీవల పాకిస్థాన్ నుంచి వస్తున్న ప్రకటనల కారణంగా మ్యాచ్ చర్చనీయాంశంగా మారింది. ఇన్ని వివాదాల మధ్య ఈ సారి మ్యాచ్ ఎలా జరుగుతుందనే క్యూరియాసిటీ ఫ్యాన్స్‌లో పెరుగుతోంది. ఇండియా- పాకిస్థాన్ మ్యాచ్ సెన్సిటివిటీని దృష్టిలో ఉంచుకుని, శ్రీలంక అధికారులు సెక్యూరిటీ అరేంజ్‌మెంట్స్ టైట్ చేశారు. టోర్నమెంట్ సజావుగా జరిగేలా చూసుకోవడానికి శ్రీలంక 'హైయెస్ట్ ప్రయారిటీ' ఇచ్చిందని లంక క్రీడాశాఖ మంత్రి సునీల్ కుమార గమాగే 'కి తెలిపారు. ఇండియా-పాకిస్థాన్ మ్యాచ్‌లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. రెండు టీమ్‌లని ప్రొటెక్ట్ చేయడానికి ఎలైట్




కమాండో యూనిట్లను మోహరించనున్నారు. టీమ్స్ ఎయిర్ పోర్ట్‌కి చేరుకున్న క్షణం నుంచి వారు దేశం విడిచి వెళ్లే వరకు, ఆర్మ్‌డ్ ప్రొటెక్షన్‌లో ఉంటారని అధికారులు తెలిపారు. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తమ ప్రపంచ కప్ మ్యాచ్‌ల కోసం ఇండియాకి వెళ్లడానికి నిరాకరించింది. తాము ఆడే మ్యాచ్‌ల ను శ్రీలంకకు మార్చాలని కోరగా.. చివరి నిమిషయంలో షెడ్యూల్, వెన్యూలు మార్చడం కుదరదని ఐసీసీ స్పష్టం చేసింది.

## విరాట్ ఇన్‌స్టా ఖాతా అదృశ్యం..

### కొన్ని గంటల తర్వాత ప్రత్యక్షం

టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సోషల్ మీడియాలో అతడిని పెద్ద సంఖ్యలో అభిమానులు అనుసరిస్తుంటారు. ఇన్‌స్టాలో అతడి వెరిఫైడ్ అకౌంట్‌కు 270 మిలియన్లకు పైగా యూజర్లున్నారు. అతడు ఏ పోస్ట్ పెట్టినా క్షణాల్లోనే లైక్‌లు, కామెంట్ల వర్షం కురుస్తుంది. విరాట్ ఇన్‌స్టాలో ఎక్కువగా బ్రాండ్ ప్రమోషన్లు, క్రికెట్ అప్‌డేట్స్, వ్యక్తిగత సమాచారం పంచుకుంటుంటాడు. అయితే శుక్రవారం ఉదయం ఉన్నట్లుండి అతడి ఇన్‌స్టా ఖాతా స్తంభించిపోయింది. 'ప్రొఫైల్ ఈజ్‌నాట్ అవెయిలబుల్' అనే మెసేజ్ కనిపించింది. అతడు గతంలో పెట్టిన పోస్టులేమీ కనిపించలేదు. దీంతో అతడి అభిమానులు గందరగోళానికి గురయ్యారు. ఉన్నట్లుండి తమ స్టార్ బ్యాటర్ ఇన్‌స్టా అకౌంట్‌కు ఏమైందని కంగారు పడ్డారు. అదే సమయంలో విరాట్ కోహ్లీ సోదరుడు వికాస్ కోహ్లీ ఇన్‌స్టా అకౌంట్ కూడా స్తంభించిపోయింది. ఆ అకౌంట్‌ను యూజర్లు యాక్సెస్ చేయాలని ప్రయత్నిస్తే.. 'ప్రొఫైల్ ఈజ్‌నాట్ అవెయిలబుల్' అని మెసేజ్ వచ్చింది. దీంతో అభిమానులు అనుష్కశర్మ ఎక్స్ ఖాతాలో పోస్టుల కింద..




విరాట్ కోహ్లీ ఇన్‌స్టా అకౌంట్‌కు ఏమైందంటూ కామెంట్ల వర్షం కురిపించారు. అలాగే ఇటీవల ట్రెండ్ అవుతున్న 'మిస్సింగ్ పెంగ్విన్'తో పోల్చుతూ విరాట్ ఫ్యాన్స్ పోస్ట్‌లు పెట్టారు. అయితే కొన్ని గంటల తర్వాత విరాట్ కోహ్లీ ఇన్‌స్టా అకౌంట్ యాక్టివేట్ అవడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే కోహ్లీ ఇన్‌స్టా ఖాతా ఇలా ఎందుకు స్తంభించిపోయిందో తెలియలేదు. ఈ విషయమై ఇప్పటివరకు మెటా కానీ, కోహ్లీ టీమ్ కానీ స్పందించలేదు.



## సిమ్యులేషన్ మ్యాచ్ తర్వాతే తిలక్‌కి ఫిట్‌నెస్ క్లియరెన్స్

టీమ్‌ఇండియా యువ బ్యాటర్, ఆసియా కప్ హీరో తిలక్ వర్మ ప్రస్తుతం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఉన్నాడు. ఇటీవల సర్జరీ అనంతరం అతడు ఫిట్‌నెస్ నిరూపించుకునే పనిలో పడ్డాడు. ఫిబ్రవరి 7 నుంచే భారత్, శ్రీలంక వేదికగా టీ20 వరల్డ్ కప్ ప్రారంభం కానుంది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అతడు ఈ రోజు (శుక్రవారం) సిమ్యులేషన్ మ్యాచ్‌లో పాల్గొననున్నాడు. ఫిట్‌నెస్ క్లియరెన్స్ వచ్చిన తర్వాత తిలక్ భారత శిబిరంలో చేరనున్నాడు. నిజానికి అతడు న్యూజిలాండ్ సిరీస్‌లోనే భారత జట్టులోకి వస్తాడనే వార్తలు వచ్చాయి. కానీ టీమ్‌మేనేజ్‌మెంట్ తిలక్ వర్మ రీప్లేస్‌మెంట్‌గా శ్రేయస్ అయ్యర్‌ను తీసుకుంది. ఫుల్ మ్యాచ్ ఫిట్‌నెస్ సాధిస్తే తిలక్‌వర్మ ఫిబ్రవరి 3న ముంబయిలో టీమ్‌ఇండియాతో కలుస్తాడని బీసీసీఐ చెప్పింది. అలాగే వెన్ను గాయం వల్ల దాదాపు సంవత్సరకాలంగా ఆటకు దూరమైన మయాంక్ అగర్వాల్ సైతం తన ఫిట్‌నెస్ సాధించాడు. టీ20 వరల్డ్ కప్ వార్మప్ మ్యాచుల్లో ఇండియా 'ఎ' తరఫున అతడు మళ్లీ బరిలోకి దిగనున్నాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో మయాంక్ ఆకట్టుకున్నాడు. అయితే గాయం వల్ల 2025 సీజన్‌లో కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్ అతడిని 2026 సీజన్ కోసం రిటైన్ చేసుకుంది. భుజం గాయం కారణంగా ఆటకు దూరమైన రియాన్ పరాగ్ సైతం ఈ రోజు సిమ్యులేషన్ మ్యాచ్ అనంతరం ఫిట్‌నెస్ క్లియరెన్స్ సాధించే అవకాశం కనిపిస్తోంది. అయితే వాషింగ్టన్ సుందర్ త్వరలో సిమ్యులేషన్ మ్యాచ్ ఆడే ఛాన్స్ ఉంది. అతడు వడోదర వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో పక్కటెముకల గాయానికి గురైన విషయం తెలిసిందే. దీంతో అతడు తర్వాత రెండు వన్డేలు, టీ20 సిరీస్‌కు దూరమయ్యాడు.

## సంజుశాంసన్ వస్తున్నాడు.. పక్కకు జరగండి

### సంజూను ఆట పట్టించిన సూర్యకుమార్ యాదవ్

తిరువనంతపురం వేదికగా శనివారం న్యూజిలాండ్‌తో టీమ్‌ఇండియా అయిదో టీ20 ఆడనుంది. ఈ నేపథ్యంలో భారత జట్టు తిరువనంతపురం చేరుకుంది. ఈ సందర్భంగా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజుశాంసన్‌ను సరదాగా ఆట పట్టించాడు. ఎయిర్ పోర్ట్ నుంచి బస్సు వరకు అతడి ముందు నడుస్తూ.. అందరినీ 'పక్కకు జరగండి.. నో ఫొటోస్.. ఎవరూ డిస్టర్బ్ చేయొద్దు.. పక్కకు జరగండి' అని అన్నాడు. దీంతో సంజుతోపాటు, పక్కన ఉన్న సిబ్బంది కూడా నవ్వులు చిందించారు. అంతకుముందు 'ల్యాండింగ్ ఇన్ గాడ్స్ ఓన్ కంట్రీ' అని సూర్య.. సంజుతో అన్నాడు. దానికి సంజు 'ఫీలింగ్ గ్రేట్' అని సమాధానమిచ్చాడు. ఈ వీడియోను బీసీసీఐ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. న్యూజిలాండ్‌తో అయిదు టీ20ల సిరీస్‌ను టీమ్‌ఇండియా ఇప్పటికే 3-1తో కైవసం చేసుకుంది. చివరి టీ20లోనూ విజయం సాధించి.. ఫిబ్రవరి 7న ప్రారంభం కానున్న టీ20 వరల్డ్‌కప్ పోరును



ఘనంగా ప్రారంభించాలని చూస్తోంది. ఈ మెగా టోర్నీలో టీమ్‌ఇండియా తన మొదటి మ్యాచ్ వాంఖడే స్టేడియం వేదికగా యూఎస్ఏతో ఆడనుంది.

## ఇక మీ గూగ్లీకి గూగుల్ సాయం: సుందర్ పిచాయ్

క్రికెట్ మ్యాచ్‌ల్లో అత్యుత్తమ అనుభూతి కోసం ఐసీసీతో గూగుల్ జట్టు కట్టింది. ఈ ఒప్పందంతో క్రికెట్‌ను మరింత లోతుగా విశ్లేషించేందుకు వీలుకానుంది. ప్రత్యక్ష మ్యాచ్‌ల వీడియో, ఆడియో వ్యాఖ్యానాన్ని అడ్వాన్స్‌డ్ ఏఐ జెమిని 3 ప్రో విశ్లేషించనుంది. దీంతో అభిమానులు మ్యాచ్‌లను మరింతగా ఆస్వాదించేందుకు వీలుపడనుంది. ఈ మేరకు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. "ఇప్పుడు గూగుల్.. మీ గూగ్లీకి సహాయం చేస్తుంది" అని పేర్కొన్నారు. ఏఐ జెమిని 3 ప్రో లైవ్ మ్యాచ్‌ను గమనించి, కామెంటరీని విని, ఏం జరిగిందనేది సరళమైన భాషలో ఫ్యాన్స్‌కు వివరిస్తుంది. మ్యాచ్ హైలైట్స్, ఆటగాళ్లు, ఆటకు సంబంధించి ఇతర ఆసక్తికర విషయాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచనుంది. ఈ అధునాతన సాంకేతికతను




వాడి, మహిళల క్రికెట్‌ను మరింతగా అభిమానులకు చేరువ చేయడం కూడా ఈ భాగస్వామ్యం ఉద్దేశం.




## మైక్రోసాఫ్ట్‌కు ఏఐ దెబ్బ..

### గంటల్లోనే రూ.36 లక్షల కోట్లు ఆవిరి

ప్రముఖ టెక్‌దిగ్గజం మైక్రోసాఫ్ట్ స్టాక్ మార్కెట్‌లో కొన్ని గంటల్లోనే భారీగా నష్టాన్ని చవిచూసింది. కంపెనీ షేరు విలువ ఒక దశలో 12 శాతం కుంగింది. దాంతో ఆ సంస్థ విలువలో 400 బిలియన్ డాలర్ల మదుపర్ల సంపద ఆవిరైంది. భారతీయ కరెన్సీలో ఈ మొత్తం రూ.36 లక్షల కోట్లు. స్టాక్ మార్కెట్ చరిత్రలో ఒక్క రోజులో ఈ స్థాయిలో పతనం కావడం ఇది రెండోది. గతేడాది జనవరిలో చైనాకు చెందిన డీప్‌సీక్ ఏఐ మోడల్ ప్రవేశంతో చిప్ తయారీ సంస్థ ఎన్విడియా 593 బిలియన్ డాలర్లను కోల్పోయింది. 2020 మార్చి తర్వాత మైక్రోసాఫ్ట్ ఈ స్థాయిలో నష్టాలను చవిచూడడం ఇదే తొలిసారి. 1986లో ఈ టెక్ సంస్థ ఐపీఓకు వచ్చిన తర్వాత ఈ స్థాయి నష్టాలను చూడటం చాలా తక్కువ. కృత్రిమ మేధపై కంపెనీ చేస్తున్న వ్యయాలతో ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నారు. కృత్రిమ మేధ, కొత్త సాంకేతికతపై చేస్తున్న ఖర్చులపై ఇప్పటికే భారీగా చర్చ నడుస్తోంది. గతేడాది పెట్టిన భారీ పెట్టుబడులకు ఏమేరకు ప్రతిఫలాలు అందాయో తెలుసుకోవాలని వాటాదార్లు భావిస్తున్నారు. మైక్రోసాఫ్ట్ తన క్లౌడ్, ఏఐ విభాగాలపై పెట్టుబడుల్లో 66 శాతం పెరుగుదల కనిపించింది. ఇటీవల త్రైమాసిక ఫలితాల్లో ఈ విషయం వెల్లడైంది. కానీ మైక్రోసాఫ్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్ అజ్యూర్ వృద్ధి గత త్రైమాసికంతో పోలిస్తే మందగించింది. ఇది మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. రాబోయే ఏడాది కాలంలో డేటా సెంటర్ల మీద గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి కంపెనీలు భారీ పెట్టుబడులు పెట్టనున్నాయి. దానికోసం గూగుల్ తప్ప మిగతా కంపెనీలన్నీ రుణాల బాట పట్టనున్నాయి. ఏఐతో తమకు స్వర్ణయుగం వస్తుందనే ఆశతోనే అప్పులు చేస్తున్నాయి. ఓపెన్ ఏఐ సంస్థ రానున్న సంవత్సరాల్లో 1.4 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరం అవుతాయని చెబుతోంది. అయితే 2030కి గానీ లాభాలు రావని ఇప్పటికే వెల్లడించింది. ఈ ఎదురుచూపులు మదుపర్లను నిరాశకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది.



## దిగొచ్చిన వెండి, బంగారం ధరలు

అంతర్జాతీయ పరిణామాలతో గత కొంతకాలంగా రాకెట్ వేగంతో దూసుకెళ్తోన్న బంగారం, వెండి ధరలు శుక్రవారం తగ్గుముఖం పట్టాయి. మదుపర్ల లాభాల స్వీకరణతో భారీగా దిగొచ్చాయి. హైదరాబాద్ విపణిలో ఉదయం 11.30 గంటల సమయంలో 24 క్యారెట్ల మేలిమి పసిడి 10 గ్రాముల ధర రూ.1,74,700 పలికింది. గురువారం రాత్రి ఈ ధర రూ.1,79,700 ఉండగా.. నేడు దాదాపు రూ.5 వేల మేర తగ్గింది. ఇక, వెండి ధర కూడా భారీగా పడిపోయింది. నిన్న రాత్రి హైదరాబాద్ విపణిలో రూ.3,99,600 వద్ద స్థిరపడిన వెండి ధర శుక్రవారం ఉదయానికి రూ.3,70,000కు దిగొచ్చింది. అంటే.. దాదాపు రూ.30వేల మేర తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్లలోనూ ఈ లోహాల ధరలు తగ్గుముఖం పట్టాయి. ఔన్సు పసిడి ధర 5,189 డాలర్లు, ఔన్సు వెండి ధర 110 డాలర్లు పలుకుతోంది. అటు ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లోనూ బంగారం, వెండి ధరలు భారీగా పడిపోయాయి. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో మార్చి డెలివరీకి వెండి ఫ్యూచర్స్ ధర శుక్రవారం రూ.12,169 తగ్గి రూ.3,87,724గా ఉంది. గురువారం ఈ ధర ఒక దశలో రూ.4.20 లక్షల వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని తాకి చివరకు రూ.3,99,893 వద్ద ముగిసింది. ఇక, ఫిబ్రవరి కాంట్రాక్ట్‌కు బంగారం ఫ్యూచర్స్ రూ.2,162 తగ్గి 10 గ్రాముల ధర రూ.1,67,241 పలికింది. అమెరికా డాలర్ విలువ క్రమంగా కోలుకుంటోంది. దీంతో బంగారం, వెండి మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడమే ధరల తగ్గుదలకు కారణమని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. ఇక, అధిక ధరల వల్ల భారత్‌లో గతేడాది బంగారం కొనుగోళ్లు తగ్గాయని ప్రపంచ స్వర్ణమండలి నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది కూడా దేశంలో బంగారం దిగుమతులు తగ్గొచ్చని పేర్కొంది.

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

## 'నారీ నారీ నడుమ మురారి' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్..

సంక్రాంతి కానుకగా విడుదలై, విజయం అందుకున్న కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ 'నారీ నారీ నడుమ మురారి'. ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. 'అమెజాన్ ప్రైమ్ వీడియో'లో ఫిబ్రవరి 4 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు కన్నడ, తమిళం, మలయాళం, హిందీలోనూ ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతుందని సదరు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. సంక్రాంతి బరిలోకి చివరిగా వచ్చిన (జనవరి 14న) ఈ చిత్రం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. ఇద్దరమ్మాయిల మధ్య నగిలిపోయే వ్యక్తిగా హీరో శర్వానంద్, హీరోయిన్లుగా సాక్షీ వైద్య, సంయుక్త ఆకట్టుకున్నారు. సీనియర్ నటుడు నరేశ్, సత్య, సునీల్, వెన్నెల కిశోర్ తమ మార్క్ కామెడీతో అలరించారు. వినోదాత్మక కథలపై తనకెంత పట్టుందో దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ సినిమాతో మరోసారి నిరూపించారు.




## జియో హాట్‌స్టార్‌లోకి 6న వస్తున్న రాజాసాబ్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ఫాంటసీ హారర్ కామెడీ చిత్రం 'ది రాజాసాబ్'. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా ఫిబ్రవరి 6 నుంచి స్ట్రీమింగ్ కానుంది. దేవనగర సంస్థానానికి ఒకప్పుడు జమిందారు గంగాదేవి (జరీనా వహాబ్). అంత గొప్ప నేపథ్యమున్నా తన మనవడు రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)తో కలిసి గంగమ్మగా సాధారణ జీవితం గడుపుతుంటుంది. తన నాన్నమ్మ అంటే రాజుకు ప్రాణం. వయసు ప్రభావం కారణంగా మతిమరుపు సమస్యలతో బాధపడుతూ ఉంటుంది గంగమ్మ. తనకు సంబంధించిన చాలా విషయాల్ని మరిచిపోయినా తన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం మరిచిపోదు. తనకు కలలో కనిపిస్తున్న తాతని ఎలాగైనా వెతికి తీసుకురమ్మని రాజాసాబ్‌ని కోరుతుంది. కానీ, కనకరాజే తనకున్న రకరకాల విద్యలతో నాన్నమ్మ, మనవడిని నర్సాపూర్ అడవిలోని రాజమహల్‌కి వచ్చేలా చేస్తాడు. ఒక దశలో ఇద్దరినీ చంపేయాలని కూడా అనుకుంటాడు. మార్మిక విద్యలెన్నో తెలిసిన కనకరాజుని రాజాసాబ్ ఎలా ఎదుర్కొన్నాడు? అసలు కనకరాజు గతమేమిటి?అతని లక్ష్యమేమిటి? రాజాసాబ్ జీవితంలోకి వచ్చిన ముగ్గురమ్మాయిలు భైరవి (మాళవిక మోహనన్), ÷-లబెస్సీ (నిధి అగర్వాల్) అనిత (రిద్ధి కుమార్) ఎవరు? తదితర విషయాలను సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.




## 'వారణాసి' విడుదల తేదీపై క్లారిటీ

### 2027 ఏప్రిల్ 7న ప్రకటించిన రాజమౌళి






'వారణాసి' విడుదల తేదీపై క్లారిటీ వచ్చింది. 2027 ఏప్రిల్ 7న సినిమాను రిలీజ్ చేయనున్నట్లు దర్శకుడు రాజమౌళి ప్రకటించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతున్న ఈ భారీ ప్రాజెక్టు రిలీజ్ డేట్ కోసం సినీ ప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో 2027 ఏప్రిల్ 7వ తేదీతో కూడిన హోర్డింగులు వారణాసిలో గురువారం ప్రత్యక్షమయ్యాయి. దీంతో 'ఇది వారణాసి విడుదల తేదీనే', 'రాజమౌళి విభిన్న ప్రమోషన్స్' అంటూ ఎక్స్‌లో చర్చ జరిగింది. ఈ సినిమా గ్లింప్స్ ఈవెంట్‌లో 2027 వేసవికి విడుదల అని చిత్ర బృందం అని చెప్పడంతో.. అభిమానులు ఏప్రిల్ 7ని ఫిక్స్ అయిపోయారు. తాజాగా రాజమౌళి దానిని ఖరారు చేశారు. వరుస సెలవుల నేపథ్యంలో: ఉగాది, గుడిపడ్వాని పురస్కరించుకుని 2027 ఏప్రిల్ 7వ తేదీన (బుధవారం) సినిమాను విడుదల చేయనుండటం గమనార్హం. ఆ తర్వాతా వరుస సెలవులు రానున్నాయి. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి, 15న శ్రీరామ నవమి. తమిళ సంవత్సరాదినీ అదే సమయంలో జరుపుకోనున్నారు. భారీ హంగులు, అత్యున్నతమైన విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందే రాజమౌళి సినిమాలు కొన్నిసార్లు ఆలస్యమవుతుంటాయి. అయితే, ఈసారి మాత్రం అనుకున్న డేట్ వచ్చేందుకు జక్కన్న సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతుండగా.. తదుపరి షెడ్యూల్‌ను అంటార్కిటికాలో ప్లాన్ చేసినట్లు తెలిసింది. ఇదే నిజమైతే.. అక్కడ చిత్రీకరణ చేసిన తొలి భారతీయ సినిమాగా రికార్డు సృష్టించనుంది. పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంకా చోప్రా కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా 120 దేశాల్లో రిలీజ్ కానుంది. ఈ విషయంలోనూ 'వారణాసి' రికార్డు నెలకొల్పనుంది.

## పల్నాడు నేపథ్యంలో భగవంతుడు మూవీ




టాలీవుడ్ యువ నటుడు తిరువీర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'భగవంతుడు'. పల్నాడు నేపథ్యంలో ఈ సినిమా రాబోతుండగా.. తాజాగా చిత్ర యూనిట్ టీజర్‌ను విడుదల చేసింది. పల్లెటూరి నేపథ్యంలో సాగే పీరియడ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం టీజర్‌లో చూపించిన విజువల్స్ మరియు తిరువీర్ పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ సినిమాపై భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మసూద, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో వంటి చిత్రాలతో నటుడిగా తన సత్తా చాటిన తిరువీర్ ఇందులో మరో విభిన్నమైన మరియు భావోద్వేగపూరితమైన పాత్రలో కనిపించబోతున్నాడు. జీజీ విహారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రవి పనస ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్‌పై రవి పనస నిర్మిస్తుండగా ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తోంది. రిషి నాగరాజు, కాలకేయ ప్రభాకర్, రవీంద్ర విజయ్, మురళిధర్ గౌడ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం తెలుగుతో పాటు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతుంది.

## రివ్యూ

## ప్రతి ఇంట్లో కనిపించే కథ.. 'ఓం శాంతి శాంతి శాంతిః'

**ప్రస్తుత ఓటీటీ కాలంలో ఏ భాషలో సినిమా వచ్చినా సరే, మిగతా భాషల్లోనూ అనువాదాలుగా వచ్చేస్తున్నాయి. దీంతో దర్శక-నిర్మాతలు ఆ మూవీని రీమేక్ చేసేందుకు సాహసించడం లేదు. చాలా తక్కువ సందర్భాల్లో మాత్రమే ఆ తరహా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అలాంటిదే 'ఓం శాంతి శాంతి శాంతిః'. మలయాళంలో విజయవంతమైన 'జయ జయ జయ జయహేకి రీమేక్ ఇది. మరి మాతృకతో పోలిస్తే ఇందులో కనిపించే కొత్త అంశం ఏంటి? ఎలాంటి వినోదాన్ని ఇచ్చింది?**



**కథేంటంటే..**

బాగా చదువుకోవాలని, మంచి ఉద్యోగం చేయాలనీ భవిష్యత్తు గురించి చిన్నప్పట్నుంచీ ఎన్నో కలలు కన్న ఓ సగటు యువతి ప్రశాంతి అలియాస్ శాంతి (ఈషా రెబ్బా). కళాశాలలో జరిగిన ఓ సంఘటనతో చదువును అర్ధాంతరంగా ఆపేసి పెళ్లికి తలూపాల్సి వస్తుంది. కట్టుకున్న అమ్మాయిని తాను చదివిస్తానని మాట ఇచ్చి మరీ శాంతిని పెళ్లి చేసుకుంటాడు చేపల వ్యాపారి ఓంకార్ నాయుడు (తరుణ్ భాస్కర్). పెళ్లి తర్వాతైనా చదువుకోవచ్చనే సంతోషంతో నాయుడుతో కలిసి ఏడడుగులు వేస్తుంది. కానీ, ఆమె ఊహించింది ఒకటి, పెళ్లి తర్వాత జరిగింది మరొకటి. భర్త అనే అహంకారంతో తన కోపాన్నంతా భార్య శాంతిపై ప్రదర్శిస్తుంటాడు ఓంకార్. ఆయనకు కోపం వచ్చిందంటే భార్య చెంప పగిలిపోవల్సిందే. ఇదే విషయాన్ని కన్నవాళ్లతో చెబితే సర్దుకుపోవాలంటూ చెబుతారు. రోజు రోజుకీ భర్త పెట్టే హింస శ్రుతిమించడంతో ఒక రోజు శాంతి ఎదురు తిరుగుతుంది. తానూ చేయి చేసుకోగలననీ భర్తకు బాగా తెలిసేలా చేస్తుంది. దాంతో కంగుతిన్న ఓంకార్ ఏం చేశాడు? ఆ తర్వాత భార్యాభర్తల మధ్య యుద్ధం ఎలా సాగింది? ఇద్దరూ విడిపోయారా? లేదా? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.

**ఎలా ఉందంటే..**

భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతి ఇంటినీ ఆలోచింపజేసే బలమైన కథ ఇది. ప్రతి అమ్మాయి, ప్రతి మహిళ తనని తాను చూసుకునే శాంతి పాత్ర ఇందులో ఉంది. ఓంకార్ నాయుడులా అహంకారం, ఆవేశంతో భార్యలపై చేయి చేసుకున్న మగాళ్లు ఈ సినిమా చూస్తున్నప్పుడు చాలామందే గుర్తుకొస్తారు. ఆ లక్షణమే రీమేక్ చేయడానికి ప్రేరేపించి ఉండొచ్చు. సున్నితమైన అంశంతో కూడిన ఇలాంటి కథల్లో మార్పు చేర్పులు అంత సులభం కాదు. అది తెలిసే చిత్ర బృందం కథ జోలికి వెళ్లలేదు. ఇది మన కథే అనే భావన కలిగేలా గోదావరి నేపథ్యాన్ని జోడించడమే ఈ సినిమాని ప్రత్యేకంగా నిలబెట్టింది. తెలుగుదనం ఉట్టిపడే పాత్రలు, గోదావరి యాస ఈ సినిమాని సొంతం చేసుకునేలా చేస్తాయి. కాకపోతే ఈ కథ మాతృకలోని లోతుని, గాఢతని తెలుగులో అంతగా ఆవిష్కరించలేదనిపిస్తుంది. సహజంగానే సున్నితమైన ఈ కథ తెలుగులోకి వచ్చేసరికి మరింత పలుచనైన అభిప్రాయం కలుగుతుంది.
అచ్చమైన గోదావరి ప్రాంతం నేపథ్యాన్ని ఆవిష్కరించే ప్రథమార్ధం ఈ సినిమాకి బలం. కట్టుబాట్ల పేరుతో అమ్మాయిల స్వేచ్ఛని, వాళ్ల హక్కుల్ని హరించి వేస్తున్నామని చెప్పకనే చెబుతాయి ఆ సన్నివేశాలు. ఓంకార్ నాయుడు పాత్ర పరిచయం తర్వాత సన్నివేశాలు సరదా సరదాగా మారిపోతాయి. బ్రహ్మాజీ నేపథ్యంలోని సన్నివేశాలు మరింత సందడిగా సాగుతాయి. శాంతి పాత్ర మెట్టినింట్లోకి అడుగుపెట్టాక అక్కడ ఆమెకి ఎదురయ్యే పరిణామాలు చాలా ఇళ్లల్లో చోటు చేసుకునే గృహ హింసకు అద్దం పట్టేలా ఉంటాయి. శాంతి ఎదురు తిరగడంతోనే కథ మలుపు తిరుగుతుంది. అక్కడ మొదలైన భార్యాభర్తల మధ్య యుద్ధం ఎక్కడ ముగిసిందన్నదే మిగతా సినిమా. ద్వితీయార్థం తర్వాత ఆ ఇద్దరి మధ్య సాగే కొన్ని సన్నివేశాలు పునరావృతం అయినట్టుగా అనిపిస్తాయి. కోర్ట్ రూమ్ నేపథ్యంలో సన్నివేశాలు మామూలుగానే అనిపించినా, అక్కడ సంభాషణలు మాత్రం ఆలోచింపజేసేలా ఉంటాయి. పతాక సన్నివేశాలు హడావుడిగా సినిమాని ముగించిన అనుభూతి కలిగిస్తాయి.

## రజనీ, కమల్ మల్టీస్టారర్ మూవీ జైలర్ డైరెక్టర్ చేతికి ప్రాజెక్ట్ ?



ఇండియన్ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లిన పాన్ ఇండియా చిత్రాలు, సీక్వెల్స్, ప్రీక్వెల్స్ హవా కొనసాగుతూనే ఉంది. ఇదే క్రమంలో మల్టీస్టారర్ సినిమాలపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా టాప్ స్టార్స్ కలిసి కనిపిస్తే ఆ సినిమా రిలీజ్‌కు ముందే భారీ హైప్ క్రియేట్ అవుతోంది. అలాంటి క్రేజీ కాంబినేషన్‌లో ఒకటిగా సూపర్ స్టార్ రజినీకాంత్ మరియు యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించే సినిమా గత కొన్నాళ్ల క్రితం ఒక్కసారిగా సెన్సేషన్‌గా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ఇద్దరు లెజెండరీ నటులు కలిసి కనిపించే ఒక ప్రాజెక్ట్ కమల్ హాసన్ నిర్మాణంలో ఉందన్న వార్తలు ఉన్నప్పటికీ, అది కాకుండా మరోసారి వీరి కలయికలో కొత్త సినిమా రాబోతుందన్న ప్రచారం ఇప్పుడు తమిళ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా వినిపిస్తున్న బజ్ ప్రకారం, ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌ను 'జైలర్' దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ టేకోవర్ చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఈ వార్తలకు మరింత బలం చేకూర్చేలా, నెల్సన్ ఇప్పటికే రజినీకాంత్ ? కమల్ హాసన్ కలయికపై ఒక అనౌన్స్‌మెంట్ కట్ లేదా కాన్సెప్ట్ వీడియో తరహా విజువల్‌ను సిద్ధం చేస్తున్నాడన్న రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ వెంటనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశం మాత్రం తక్కువగా ఉందని సమాచారం. ప్రస్తుతం నెల్సన్ 'జైలర్ 2'తో పాటు ఇతర కమిట్‌మెంట్స్‌లో బిజీగా ఉండగా, తెలుగులో కూడా ఒక సినిమా చేయాల్సి ఉన్నట్టు తెలుస్తోంది. ఆ ప్రాజెక్ట్ పూర్తి అయిన తర్వాతే ఈ భారీ మల్టీస్టారర్‌పై దృష్టి పెట్టే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. రజినీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే అది కేవలం సినిమా మాత్రమే కాకుండా ఒక చరిత్రగా నిలుస్తుందన్న అభిప్రాయం అభిమానుల్లో ఉంది. అందుకే ఈ ప్రాజెక్ట్‌పై వస్తున్న ప్రతి చిన్న వార్త కూడా భారీ చర్చకు దారి తీస్తోంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com